





సర్పంచ్‌లకు.. పూర్వవైభవం

- వలంటీర్ల రాజ్యంలో చిన్నబోయిన గ్రామ పెద్ద
- నిధులు, విధులు మీవేనంటూ పంచాయతీ కమిషనర్ స్పష్టీకరణ
- ఉమ్మడి జిల్లాలోని 1172 ప్రెసిడెంట్‌లకు పూర్వ వైభవం
- గ్రామ స్వపరిపాలన కు ప్రాణం పోసిన కూటమి ప్రభుత్వం



గుంటూరు సిటీ, జూలై 31 : ఒకప్పుడు గ్రామ సర్పంచ్ అంటే మకుటం లేని మహారాజు. ఊర్లో అన్ని పనులు ఆయన చేతుల మీద గానే జరిగేవి . విద్యుత్ దీపం దగ్గర నుండి విందు, వినోదం వరకు సర్పంచ్ అన్నీతానై నిర్వహించేవారు. ఆ హోదా ఆ దర్పం ఒక రేంజ్‌లో ఉండేది. జగన్ ప్రభుత్వం స్థానిక స్వపరిపాలన సంస్థలను నిర్వీర్యం చేసింది. సర్పంచ్ అనే మాటకు అర్థాన్ని మార్చివేసింది. వలంటీర్ల రాజ్యంలో ప్రజలు ఎన్నుకున్న గ్రామ పెద్ద చిన్నబోయాడు. కేవలం ఉత్సవ విగ్రహం గానే మిగిలి పోయాడు . విధులు లేవు. నిధులు లేవు. ఏదో పేరుకే అలా పదవిలో ఉన్నారు. ఊరికి ఏదో చేద్దామన్న ఆశతో కోట్లు ఖర్చుపెట్టి మరీ కొంతమంది ఉన్నత విద్యావంతులు కూడా సర్పంచులుగా పదవులు చేపట్టారు. జగన్ ప్రభుత్వంలో అసలేమీ చేయలేమని అర్థం అయిపోయి ఎంతగానో కృంగిపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం మళ్లీ సర్పంచులకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తుంది. కేవలం ఉత్సవ విగ్రహాలుగా మాత్రమే మిగిలిపోయిన వారికి ప్రాణం పోసేందుకు నడుంకట్టింది. గ్రామ స్వపరిపాలన సంస్థ పూర్తిగా సర్పంచ్ కనుసనల్లోనే నడిచే విధంగా చర్యలకు ఉపక్రమించింది. ఈ పరిణామం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 1172 మంది సర్పంచులకు ఆనందాన్ని కలిగిస్తున్నది . గుంటూరు జిల్లాలో 227, పల్నాడు జిల్లాలో 519,బాపట్ల జిల్లా లో 426 మంది సర్పంచులకు ఇది ఆనందం కలిగించే విషయం.

పంచాయతీ సొమ్ము పక్కదారి

జగన్ ప్రభుత్వం సర్పంచ్ లను ఉత్సవ విగ్రహాలుగా మార్చటమే కాకుండా ,పంచాయతీ నిధులను పక్కదారి పట్టించింది.గడచిన ఐదేళ్ల కాలంలో గ్రామీణ ప్రాంతాలకు కొద్ది పాటి నిధు లు కూడా విడల్చలేదు.కేంద్రం ఇచ్చిన 15 ఆర్థిక సంఘం నిధులు రూ .42 కోట్ల ను పక్కదారి పట్టించింది. చాలా మంది సర్పంచ్‌లు కరోనా సమయంలో అప్పులు చేసి మరీ పారి శుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వాటిని కూ డా ప్రభుత్వం విడుదల చేయలేదు. కరెంటు బిల్లులు చెల్లించేందుకు, ఇతర కార్యక్రమాలు నిర్వహించేం దుకు సర్పంచ్‌లు తలలు పట్టుకోవాలిసిన పరిస్థితిని కలిగించింది.

అసలు సర్పంచు అంటే ఎవరు ...

సర్పంచి అంటే అధికారులకు, గ్రామీణ సమాజానికి మధ్య వారధి లాంటి వారు.స్థానిక స్వపరిపాలన సంస్థ భారత రాజ్యాంగ బద్ధంగా రూపుదిద్దుకున్న చట్టబద్ధత కలిగిన సంస్థ. గ్రామానికి సర్పంచి ప్రథమ పౌరుడు. అక్కడ ఆయన చెప్పిందే వేదం. అంతటి ప్రాధాన్యం , చట్టబద్ధత కలిగిన పదవిని జగన్ తీసుకువచ్చిన సచివాలయ సమాంతర వ్యవస్థ పూచిక పుల్లతో సమానంగా చేసింది. సచివాలయం ఏర్పడి వలంటీర్లు వచ్చాక ప్రజలకు సర్పంచ్‌తో పెద్దగా పనిలేకుండా పోయింది. గ్రామ కార్యదర్శి, వలంటీర్లు ఊరిలో నిర్ణయాత్మక శక్తిగా మారిపోయారు. ఏదో ఉన్నారంటే వున్నారు అన్న విధంగా ఆ పదవిని దిగదార్చారు.

బాధలన్నీ పోయినట్లే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం తో సర్పంచ్ లు ఊపిరి పీల్చుకున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ సమీక్ష లో భాగంగా 15వ ఆర్థిక సంఘం నిధులను పాత ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్న విషయాన్ని అధి కారులు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లారు. వెంటనే ఆ విషయం పై దృష్టి సారించాలని ఆయ న ఆదేశించటంతో నిధులు పంచాయతీల ఖాతాల్లో జమ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

సర్పంచ్‌లతో కమీషనర్ భేటీ

ప్రభుత్వ ఆదేశాలతో పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణ తేజ రాష్ట్రంలోని సర్పంచుల సంక్షేమ సంఘం ప్రతినిధులతో సచివాలయంలో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ భేటీలో తమ ఇబ్బందులను సర్పంచుల సంక్షేమ సంఘం నేతలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇక మీదట గ్రామాల్లో అన్ని కార్యక్రమాలు కేవలం సర్పంచి చేతుల మీద గానే జరుగుతాయని డైరెక్టర్ హామీ ఇచ్చారు. నిధులు, విధులు అన్నీ మీవే అని స్పష్టం చేశారు. స్థానిక స్వపరిపాలన చట్టానికి లోబడి సర్పంచి పూర్వ వైభవానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే రాష్ట్రం ఏర్పాటు చేయాల్సిన 5 వ ఆర్థిక సంఘం కూడా ఏర్పాటు చేసి నిధులు విడుదల చేస్తామని చెప్పటం తో సర్పంచు ల్లో ఆనందం వెల్లువెత్తుతుంది.

తలెత్తుకొని ఊరిలో తిరుగుతాం..



గత ప్రభుత్వం వల్ల గ్రామానికి ఏమి చేయలేక తలదిం చుకొనే పరిస్థితి. ఇప్పుడు మాకు భరోసా వచ్చింది. ఊరికి ఏదో ఒకటి చేసే అవకాశం వచ్చింది. ఇంక తలెత్తుకొని ఊరిలో తిరుగుతాం.మా విధులు నిర్వర్తించి ఊరికి ఉపకారిగా మారుతాం. పంచాయతీలకు, సర్పంచులకు పూర్వ వైభవం వచ్చినట్లే.

- చిలకలపూడి పాపారావు
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంక్షేమ సంఘం

మా ఊరు.. మేము..



మాకు ప్రజలు ఓట్లేసి గెలిపించింది ఏదో ఒకటి చేస్తామని. ఐదేళ్లు ఏమి చేయలేదు. కేవలం ఉత్సవ విగ్రహాల మాదిరిగా మాత్రమే ఉన్నాం .ఇప్పుడు మా ఊరికి మేలు చేసే అవకాశం ఉంటుంది.

- పూల నాగమణి,మేడికొండూరు పంచాయతీ సర్పంచ్

సర్వం సిద్ధం

- పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి
- 7.78 లక్షల మందికి రూ.316.84 కోట్లు విడుదల
- లబ్ధిదారుల మ్యాపింగ్ ప్రక్రియ నూరుశాతం పూర్తి
- ఈ నెలలోనూ సచివాలయ సిబ్బంది ద్వారానే పంపిణీ
- కార్యక్రమాల్లో పాల్గొననున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధమయింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 7 లక్షల మందికి పింఛన్లు అందజేసేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న సచివాలయ ఉద్యోగులే ఈసారి కూడా లబ్ధిదారులకు పింఛన్లు అందజేయను న్నారు. గురువారం ఉదయం 6 గంటలకే పింఛను పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడు జిల్లాల్లోని 7.78 లక్షల మంది లబ్ధిదారులకు సంబంధించి రూ.316.84 కోట్లు ఇప్పటికే బ్యాంకు ఖాతాల్లో జమయ్యా యి. మూడు రోజుల ముందుగానే నగదు జమ కావడంతో బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకుని ఉద్యోగులు పంపిణీకి సిద్ధమయ్యారు.

ఉదయం 6 గంటల నుంచే..

పింఛన్ పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం 6 గంటలకల్లా ప్రారంభం కావాలని అధికారులు ఇప్పటికే సచివాలయ సిబ్బందికి స్పష్టం చేశారు. గత నెల ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించడంతో పంపిణీ కొంచెం ఆలస్యమైం దని, ఈసారి అలాంటి జాప్యం జరగడానికి వీలులేదని అధికారులకు తేల్చి చెప్పారు. గత నెలలో తలెత్తిన సర్వర్ సమస్యలు కూడా రాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత సిబ్బందికి తెలిపారు. ఒక్కో సచివాలయ ఉద్యోగి 50 నుంచి 100 మందికి పింఛన్లు ఇచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. కిందటి నెలలో వచ్చిన చిన్నపాటి సమస్యలు కూడా రాకుండా ముందుగానే లబ్ధిదారుల మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఉన్న 7లక్షల 78 వేల మంది లబ్ధిదారులకు ఒక్కరోజులోనే పింఛన్ అందజేయాలని అధికారులు టార్గెట్ పెట్టుకున్నారు. గుంటూరు జిల్లాలో సాధారణ పింఛనుదారులు 2 లక్షల 58 వేల 768 మంది ఉండగా, దివ్యాంగులు 2,802 మంది ఉన్నారు. వారికి రూ.110.69 కోట్ల నిధులు విడుదలయ్యాయి. పల్నాడు జిల్లాలో 2 లక్షల 79 వేల 975 మంది సాధారణ పింఛనుదారులు, 3వేల మంది దివ్యాంగులకు రూ.112 కోట్లు విడుదలయ్యాయి. బాపట్ల జిల్లాలో సాధారణ పింఛనుదారులు 2 లక్షల 33వేల 102 మంది, దివ్యాంగులు 2,300 మంది ఉండ గా వారికి రూ.94 కోట్లు విడుదల య్యాయి. మొత్తంగా మూడు జిల్లాల్లో 7లక్షల 78 వేల మందికి రూ.316.84 కోట్లు విడుదలయ్యాయి.

అవ్వాతాతలు.. దివ్యాంగులకు గురువారం ఉదయం ఆరు గంటలకే పింఛన్ అందచేసేందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు సిద్ధం చేశారు. గత నెలలో ఎదురైన సమస్యలు ఈ సారి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. మూడు రోజుల ముందుగానే నగదును ప్రభుత్వం విడుదల చేసింది. లబ్ధిదారుల ప్రక్రియను సచివాలయ సిబ్బంది బుధవారం సాయంత్రానికే నూరు శాతం పూర్తి చేశారు. గురువారం తెల్లవారగానే లబ్ధిదారుల ఇంటికెళ్లి సచివాలయ సిబ్బంది నగదు అందచేయనున్నారు. సర్వర్ సమస్య రాకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కడికక్కడ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు.

పాల్గొననున్న ప్రజా ప్రతినిధులు

జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమాల్లో కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. వారి ద్వారానే లబ్ధిదారులకు పింఛను అందజేయనున్నారు. ఎన్ని ముఖ్యమైన పనులు ఉన్నా వాటిని వాయిదా వేసుకుని విధిగా ప్రతి నెలా పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. దీంతో మంత్రులు, ఎమ్మెల్యేలు వారివారి నియోజకవర్గాల్లో జరిగే పింఛను పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

బియ్యంతో సరి



- రెండో నెలలోనూ రేషన్ అంతే
- కార్డుదారులకు కందిపప్పు, పంచదార లేనట్లే
- ప్రైవేట్ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.180

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) రూ.లక్షల విలువైన వాహనం.. ఓ డ్రైవర్, ఓ సహాయకుడు.. సైరన్ మోగించుకుంటూ వచ్చి ఇచ్చేది.. బియ్యం మాత్రమే. ఇంటి వద్దకే రేషన్ సరుకులు అంటూ వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించి చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఉచిత బియ్యంతో సరిపెట్టింది. కూటమి ప్రభుత్వంలోనూ ఇదే పంథా రెండు నెలలుగా కొనసాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాం నుంచి రేషన్ దుకాణాల్లో కందిపప్పు పంపిణీని నిలిపివేశారు. అయితే ప్రభుత్వం మారిన వెంటనే రేషన్‌లో కందిపప్పు, పంచదార పంపిణీ చేస్తామని కూటమి నేతలు ప్రకటించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని సరఫరా చేస్తారని లబ్ధిదారులు ఆశగా ఎదురు చూశారు. అయితే జూలైలో మాదిరిగానే ఆగస్టులో కూడా కందిపప్పు పంపిణీ జరగదని తెలిసి పేదలు ఉసూరుమంటున్నారు. అక్కడక్కడ ఏదో కొంతమందికి మాత్రం గత నెలలో సరఫరా జరిగినట్లు తెలుస్తోంది. కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.175 నుంచి రూ.180 వరకు ఉంది. ప్రభుత్వం కిలో కందిపప్పు రాయితీపై రూ.67 ఇవ్వాల్సి ఉంది. ప్రైవేట్ మార్కెట్‌లో కిలోకు రూ.100 నుంచి రూ.110 వరకు అధికంగా ఉంది. ఈ పరిస్థితుల్లో రాయితీ పై కందిపప్పు పంపిణీ చేయాలని కార్డుదారులు కోరుతున్నారు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కందిపప్పు, పంచదార పంపిణీని ప్రభుత్వం దాదాపుగా నిలిపివేసింది. పల్నాడు జిల్లాలో 6,45,110 తెల్ల కార్డులు ఉన్నాయి. ఒక్కోక్క కార్డు దారునికి కనీసం కిలో కందిపప్పు అందజేయాలి. అయితే 1.35 శాతం కార్డుదారుల కు మాత్రమే సరఫరా చేసినట్టు పౌరసరఫరాల శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. బాపట్ల జిల్లాలో 4,86,029 కార్డుదారులకు కందిపప్పు సరఫరా చేయలేదు. ఏడు ప్యాకెట్లు మాత్రమే అందజేయడం గమనార్హం. గుంటూరు జిల్లాలో 5,99,511 కార్డుదారులెవ్వరికూ కూడా కందిపప్పు సరఫరా కాలేదు.

బాలల చట్టాలు సమర్థంగా అమలు చేయాలి

ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

బాపట్ల, జూలై 31: బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా రూపొందించిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని ఏపీ బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. బాలల హక్కుల సంరక్షణపై అనుబంధశాఖల అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. బాలకార్మిక రహిత సమాజం నిర్మాణం కోసం, వారి హక్కులు పరిరక్షించటంకోసం ప్రతి ఒక్కరు కార్యోన్ముఖులు కావాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగడానికి మంచి అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలోని కొందరు బాలలు, యువత గంజాయికి బానిసలు కావడం బాధాకరమన్నారు. మందుల షాపుల్లో మత్తు మందులు పిల్లలకు విక్రయించకుండా చర్యలు చేపట్టాలన్నారు. మాదకద్రవ్యాల రహిత జిల్లాగా బాపట్లను తీర్చిదిద్దడానికి అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. బాలలకు మంచి భవిష్యత్తు ఏర్పడేలా విద్యాబుద్ధులు నేర్పి మంచి మార్గంలో నడిపించాలన్నారు. ఫోక్సో చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు తక్షణమే పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు, వసతిగృహాలలో ఫిర్యాదుబాక్స్‌లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. జిల్లాలో డీ-ఎడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. జేసీ బి.సుబ్బారావు, ఏఎస్పీ విఠలేశ్వర్ మాట్లాడుతూ బాలల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. బాలల హక్కుల పరిరక్షణ యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమ, సీడబ్ల్యూసీ నీలిమా వంశీలత, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, డీఈవో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల పద్మావతి

డీఎస్పీలకు స్థానచలనం

- తొలి జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొమ్మిది మంది బదిలీ

గుంటూరు, జూలై 31: ఎట్టకేలకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా భారీగా డీఎస్పీల బదిలీలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు బుధవారం 96 మందితో తొలి జాబితా విడుదల చేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పలువురికి స్థానచలనం కలిగింది. గత సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల కమిషన్ నిబంధనలకనుగుణంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం డీ ఎస్పీలను నియమించుకుంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడుస్తున్నా గత ప్రభుత్వ హయాంలో నియమితులైన వారే కొనసాగుతుండటంపై పార్టీ శ్రేణుల నుంచే కాక పోలీసు వర్గాల నుంచి కూడా విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ పరిస్థి తుల్లో ఎట్టకేలకు డీఎస్పీల బదిలీలపై రాష్ట్ర ప్రభు త్వం దృష్టి పెట్టింది.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వీవీ నాయుడు	ట్రాఫిక్, గుంటూరు	ఏసీపీ ట్రాఫిక్ , విజయవాడ
బీ జనార్ధనరావు	ఏసీపీ ట్రాఫిక్, విజయవాడ	తెనాలి
ఎం రమేష్	తెనాలి	డీజీపీ కార్యాలయం
పత్రిని శ్రీనివాసరావు	డీసీఆర్‌బీ, గుంటూరు	కాశీబుగ్గ
పీ మల్లికార్జునరావు	సీఐడీ గుంటూరు	దిశ, ఉమెన్ పీఎస్, విజయవాడ
సీహెచ్ రవికాంత్	నార్త్, గుంటూరు	డీజీపీ కార్యాలయం
ఎండీ మహబూబ్‌బాషా	సౌత్, గుంటూరు	డీజీపీ కార్యాలయం
సీహెచ్ శ్రీనివాసరావు	గురజాల	డీజీపీ కార్యాలయం
బీ ప్రసాద్	వెయిటింగ్	దిశ, ఉమెన్ పీఎస్, పల్నాడు

నాడు కక్ష పూరితం నేడు ఉదారత



హనుమాజీ పాలెంలో కంప చెట్లతో నిండిపోయిన లే అవుట్

- వైసీపీ అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ గృహాల బిల్లుల నిలిపివేత
- రూ.18 కోట్లు నేటికీ పెండింగే, పది వేల మంది లబ్ధిదారుల ఇక్కట్లు
- నెలన్నరలో జగన్ స్కీమ్‌ల బిల్లులు రూ.33 లక్షలు చెల్లించిన కూటమి ప్రభుత్వం

బాపట్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారం చేపట్టగానే పేదింటిపై కక్షపూరితంగా వ్యవహరించింది. 2019లో గద్దెనెక్కగానే ఎన్టీఆర్ హౌసింగ్ స్కీంను అటకెక్కించింది. లబ్ధిదారులకు బిల్లులను సైతం చెల్లించలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పేదల ఇళ్లపై గత ప్రభుత్వంలా కక్షపూరితంగా వ్యవహరించకుండా ఉదారంగా ఉంటోంది. జగనన్న కాలనీల బిల్లుల చెల్లింపు విషయంలో ఉదారతతో వ్యవహరిస్తూ పేదల పక్షాన ఉంది. నెలన్నర వ్యవధిలోనే జగనన్న ఇళ్ల తాలూకా దాదాపు రూ.33 లక్షలను లబ్ధిదారులకు చెల్లించడమే కాకుండా, వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్లను సైతం త్వరితగతిన పూర్తి చేస్తే వాటికి కూడా బిల్లులు చెల్లిస్తామనే భరోసాను ఇచ్చింది. వైసీపీ ప్రభుత్వం నిలిపేసిన ఎన్టీఆర్ గృహాలకు సంబంధించి పెండింగ్ ఉన్న బిల్లులపై ప్రస్తుతం గృహనిర్మాణ శాఖ కసరత్తు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు పదివేల మందికి రూ.18 కోట్లు పెండింగ్ పెట్టినట్లు గృహ నిర్మాణ శాఖ తేల్చింది.

జగనన్న కాలనీలపై ప్రచారానికే పెద్దపీట..

జగనన్న కాలనీల పేరిట వైసీపీ ప్రభుత్వం చేపట్టిన గృహనిర్మాణాల విషయంలో పేదలకు న్యాయం చేయడంపై కాక ఆర్భాటపు ప్రచారంపైనే దృష్టి పెట్టింది. జిల్లాలో 120 లే అవుట్‌లకు జగనన్న కాలనీల పేరిట ఆర్చ్ నిర్మాణానికి రూ.6 లక్షల అంచనాతో ప్రతిపాదనలు ప్రభుత్వపు చివరిరోజుల్లో రూపొందించింది. కూటమి ప్రభుత్వం రావడంతో అది అంతటితోనే ఆగిపోయింది. జగనన్న కాలనీలకు స్థలాల సేకరణ మొదలుకుని లబ్ధిదారుల ఎంపిక వరకు అన్నీ వైసీపీ నేతల కనుసన్నల్లోనే జరగడంతో అర్హులైన ఎంతోమంది సొంతింటి కలకు దూరమయ్యారు. ప్రస్తుత ప్రభుత్వం పేదలకు ఇళ్ల నిర్మాణంపై నూతన పాలసీని ఇటీవలే ప్రకటించిన సంగతి తెలిసిందే. అందుకు సంబంధించి విధివిధానాల జారీకి ముందే గత ప్రభుత్వంలో వేసిన లే అవుట్లలో ఎన్ని ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి అనే అంశంతో పాటు ప్రారంభించిన ఇళ్లు ఏ దశలో ఉన్నాయి అనే అంశాలపై గృహనిర్మాణ శాఖ కసరత్తు చేస్తోంది. ఇంటి నిర్మాణ దారులకు బిల్లుల విషయంలో ఏవైనా అపోహలు ఉన్నా నివృత్తి చేయాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగానిదేనని కూటమి ప్రభుత్వం మార్గనిర్దేశనం చేసింది.

336 లే అవుట్లు ఖాళీగానే..

జిల్లాలో జగనన్న కాలనీల నిర్మాణం పేరిట గత ప్రభుత్వం చేసిన హడావిడి అంతా ఇంతా కాదు. మొత్తం 694 లే అవుట్లకు 336 చోట్ల ఒక్క ఇంటి నిర్మాణానికి కూడా ప్రభుత్వం నుంచి అనుమతులు మంజూరు కాలేదు. స్థలం పొందిన 22,000 మంది సొంతగూడు విషయంలో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. 358 లే అవుట్లలో 25,000 మంది లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ అనుతులను గత ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో ఇప్పటి వరకు పూర్తయిన ఇళ్లు కేవలం 12,000 మాత్రమే. వీటి బిల్లుల చెల్లింపులో లబ్ధి దారులకు చుక్కలు చూపించింది. ప్రస్తుత ప్రభుత్వం ప్లాట్లు ఇచ్చి నిర్మాణం మొదలు వారికి నూతన స్కీంలో ఎలా న్యాయం చేయా లనే దానిపై కసరత్తు చేస్తోంది. లే అవుట్లలో ఎవరికీ కేటాయించని ప్లాట్లు దాదాపు 5,500 వరకు ఉన్నట్లు గుర్తించారు. వీటి విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే అంశంతో పాటు ఇప్ప టికే నిర్మాణం ప్రారంభించిన లబ్ధిదారుల ఇళ్లను డిసెంబరులోపు పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



బాపట్ల పరిధిలోని మూలపాలెం జగనన్న కాలనీ

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
గురువారం • 1 ఆగస్టు 2024
cinema@andhrajyothy.com



నా దగ్గర ఆధారాలు ఉన్నాయి..
లీగల్‌గానే వెళతా

హీరో రాజ్‌తరుణ్, లావణ్యల వివాదం బుధవారం కొత్త మలుపు తిరిగింది. రాజ్‌తరుణ్ హీరోగా నటించిన 'తిరగబడరా సామీ' చిత్రం ప్రీ రిలీజ్ ఫంక్షన్ బుధవారం జరిగితే అక్కడికి లావణ్య వచ్చారు. ఆ చిత్ర కథనాయిక, ఈ వివాదానికి కేంద్ర బిందువు అయిన మాల్వీ మల్హోత్రా కూడా వచ్చారు. రాజ్‌తరుణ్, మాల్వీ ఇద్దరూ వైట్ డ్రస్‌లో ఉండడం గమనార్హం. రాజ్‌తరుణ్ వస్తున్నాడని తెలియగానే మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. 'నా సినిమా హిట్ అయినప్పుడు కూడా ఇంత మంది మీడియా సభ్యులు రాలేదు' అంటూ రాజ్‌తరుణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తనపై వచ్చిన వివాదం గురించి ఆ మీడియా సమావేశంలో రాజ్‌తరుణ్ చెప్పిన మాటలు ఇవి.

- నాలో ఉన్న అమాయకత్వాన్ని అవకాశంగా తీసుకుంటున్నారు. నేను ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడడం లేదు. ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. అందుకే లీగల్‌గా వెళుతున్నాను.
- నా వల్ల గర్భం వచ్చిందనీ, అబార్షన్ చేయించానని ఆరోపిస్తున్నారు. మరి ఆ విషయాన్ని పోలీసులకు ఇచ్చిన కంప్లయింట్‌లో ఎందుకు చేర్చలేదు? ఎందుకంటే అవి నిజాలు కావు కనుక. అందుకే ఈ విషయం గురించి నేను మాట్లాడను. మా లాయర్ ద్వారా ప్రొసీడ్ అవుతున్నా.
- నాకు ఇప్పుడు 32 ఏళ్లు. ఇన్నేళ్ల జీవితంలో ఎందరో పరిచయం అయి ఉంటారు. ఎంతో మందితో సాన్నిహిత్యం ఉంది. వాళ్లలో ఎవరైనా నేను మంచి వాడిని కాదు అని చెబితే పరిశ్రమ నుంచి తప్పుకొంటా.
- నేనూ మనిషినే. బాధలు ఉండవా! ఆ బాధ వల్లే 'పురుషోత్తముడు' చిత్రం ఫంక్షన్‌కు కూడా రాలేదు. ఆ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు.
- నాకు పెళ్లి మీద ఆసక్తి లేదు. అది ఇప్పుడు చెబుతున్న మాట కాదు. నా పాత ఇంటర్వ్యూలు చూస్తే అది మీకు తెలుస్తుంది.
- 'తిరగబడరా సామి' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. రవికుమార్ చౌదరి దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఫ్యామిలీ అంతా చూడదగ్గ సినిమా ఇదనీ, మాల్వీ మల్హోత్రా మంచి నటి అనీ, ఆమెకు ఇదే తొలి సినిమా కనుక ఆదరించండి.


లావణ్య ప్రత్యక్షం



తనకు కనిపించకుండా తిరుగుతున్న రాజ్‌తరుణ్ ప్రసాద్ ల్యాబ్‌లో ఉన్నారని తెలియగానే లావణ్య అక్కడ ప్రత్యక్షమయ్యారు. రాజ్‌తరుణ్ కలుసుకోవాలని ఆమె చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కొంతమంది మీడియా ప్రతినిధులు ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించినా అప్పటికే అక్కడికి చేరుకున్న పోలీసులు లావణ్యను అక్కడ నుంచి పంపించేశారు. ఆ తర్వాత ఆమె మాదాపూర్‌లోని రాజ్‌తరుణ్ ఇంటికి చేరుకొని అక్కడ కూడా అందోళనకు దిగారు. తలుపు తీసే వరకూ అక్కడ నుంచి వెళ్లనని అన్నారు. రాజ్‌తరుణ్ అడిగిన ఆధారాలు తెచ్చినట్లు చెప్పారు.



కట్టి పడేసే కియారా



రామ్‌చరణ్ హీరోగా తమిళ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ బడ్జెట్ చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కియారా అద్వాని కథానాయిక. బుధవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా లుక్ పోస్టర్ విడుదల చేశారు. చూపు తిప్పుకోవడం కష్టం అనేంతగా ఉన్న కియారా గ్లామర్ లుక్ అభిమానుల్ని కట్టి పడేస్తోంది.

'గద్దర్ అవార్డ్స్‌పై కమిటీ ఏర్పాటు

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫిల్మ్ అవార్డ్స్ ను ఇకపై 'గద్దర్' అవార్డ్స్ పేరుతో ఇవ్వడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయించడంపై తెలుగు చిత్ర పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'నటుడిగా, గాయకుడిగా ఎంతో ప్రతిభ కలిగిన వ్యక్తి గద్దర్. ఆయన పేరు మీద అవార్డులు ఇవ్వాలనుకోవడం సముచిత నిర్ణయం. ఈ అవార్డుల విధివిధానాలు ఎలా ఉండాలో తయారు చేయడానికి తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలుగు నిర్మాతల మండలి ఓ కమిటీని నియమిస్తాయి. ఆ విధి విధానాలను ఎఫ్.డి.సి. ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారికి త్వరలో అందజేస్తాం' అని తెలుగు చిత్ర పరిశ్రమ ఒక ప్రకటనలో తెలిపింది.

ఫ్యామిలీ డ్రామా




కృష్ణవంశీ, మోక్ష జంటగా నటించిన 'అలనాటి రామచంద్రుడు' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. చిలుకూరి ఆకాశ్‌రెడ్డి దర్శకుడు. హైమవతి, శ్రీరామ్ జడపోలు నిర్మాతలు. ఈ సినిమా నచ్చడంతో దిల్ రాజు విడుదల చేస్తున్నారు. ఫీల్‌గుడ్ ఫ్యామిలీ డ్రామా ఇదనీ, కథ అనుకున్నప్పుడే కొత్త వాళ్లతో తీయాలని అనుకున్నామనీ దర్శకుడు చెప్పారు. ఈ జనరేషన్‌కు కావాల్సిన స్వచ్ఛమైన ప్రేమను చిత్రంలో చూపించామనీ, కొత్త టాలెంట్‌తో సినిమా తీశామని నిర్మాతలు చెప్పారు.

బడ్డీనే హీరో



అల్లు శిరీష్ హీరోగా నటించిన 'బడ్డీ' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. జ్ఞానవేల్ రాజా, అధన నిర్మాతలు. శామ్ ఆంటోన్ దర్శకుడు. బుధవారం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో అల్లు శిరీష్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను సెకండ్ హీరో. టెడ్డీ బేర్ ఫస్ట్ హీరో. టెడ్డీ చేసే యాక్షన్ సీన్లు అలరిస్తాయి' అని చెప్పారు. ఈ సినిమా విషయంలో నిర్మాత హ్యాపీగా ఉన్నారనీ, టీమ్ కూడా సంతోషంగా ఉందని దర్శకుడు చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో



నా గత చిత్రాలకు మల్లే 'శివం భజే' సినిమాలోనూ ఓ కొత్త థ్రిల్లింగ్ అంశాన్ని చూపించబోతున్నాం అని హీరో అశ్విన్ బాబు అన్నారు. ఆయన హీరోగా అప్సర్ దర్శకత్వం వహించిన చిత్రమిది. నేడు విడుదలవుతున్న సందర్భంగా అశ్విన్‌బాబు మీడియాతో ముచ్చటించారు. 'ఇందులో కుటుంబ అనుబంధాలతో పాటు ఆధ్యాత్మిక అంశాలను స్పృశించాం. శివుని ఆజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు అని బలంగా నమ్మే పాత్ర నాది. ఇందులో యాక్షన్ స్టైలిష్‌గా ఉంటుంది' అని ఆయన చెప్పారు.

కీర్తి కామెడీ



కీర్తిసురేశ్ లీడ్‌రోల్ పోషిస్తున్న మహిళా ప్రాధాన్య చిత్రం 'రఘుతాత'. సుమన్ కుమార్ దర్శకుడు. ఆగస్టు 15న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం మేకర్స్ ట్రైలర్‌ను విడుదల చేశారు. గడుసైన యువతి పాత్రలో కీర్తి కామెడీ పండించిన తీరు ఆకట్టుకుంది. హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది.


తుపాన్ లాంటి యాక్షన్



విజయ్ ఆంటోనీ హీరోగా నటించిన 'తుపాన్' చిత్రం శుక్రవారం విడుదలవుతోంది. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్ బోరా, లలిత, ప్రదీప్, పంకజ్ బోరా నిర్మించారు. ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ ఆంటోని మాట్లాడుతూ ''బిచ్చగాడు' తర్వాత నా మనసుకు దగ్గరైన కథ ఇది. ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది. యాక్షన్ ఘట్టాలు ఆకట్టుకుంటాయి. తెలుగు ప్రేక్షకులు ఈ చిత్రాన్ని ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం యూనిట్ చాలా కష్టపడింది. విజయ్ ఆంటోని ఇందులో సరికొత్తగా కనిపిస్తారు. వినోదం,యాక్షన్ అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.









ఏఎన్‌యూలో పలు పదవుల భర్తీ

● నియామక ఉత్తర్వులు అందజేసిన ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు

పెదకాకాని, జూలై 31: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) లోని వివిధ స్థానాల్లో పదవులను భర్తీ చేసినట్లు ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కే.గంగాధరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్నేషనల్ స్టూడెంట్‌సెల్(ఐఎస్‌సీ) ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ పీ. పద్మావతి (జువాలజీ), ఉమెన్స్ స్టడీస్ సెంటర్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా డాక్టర్ ఈ.వీ. పద్మజ (హిస్టరీ), కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీఈ)గా ఆలపాటి శివప్రసాదరావు నునియమించారు. ఈమేరకు వారికి నియామక ఉత్తర్వులను అందజేసినట్లు అందజేశారు. తమపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన వీసీ ప్రొఫెసర్ గంగాధరరావు, రెక్టార్ ప్రొఫెసర్ కే.రత్నషీలామణిలకు వారు ధన్యవాదాలు తెలియజేశారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తమ వంతు కృషిని శక్తివంచన లేకుండా అందిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఇసుక తవ్వకాలకు ముందు, తర్వాత పరిస్థితిని ఉపగ్రహ చిత్రాలను పరిశీలిస్తున్న సీఎం

ఇసుక తవ్వకాలపై సీఎం సమీక్ష

● కేసులు నమోదు చేశామన్న అధికారులు

● రెవెన్యూని సైతం రికవరీ చేయాలని సీఎం ఆదేశం

గుంటూరు, జూలై31(ఆంధ్రజ్యోతి): దుగ్గిరాల మండలంలోని వీర్లపాలెంలో వైసీపీ హయాంలో ఇసుకని అక్రమంగా దోచేశారు. ప్రభుత్వ ఖజానాకు నామమాత్రంగానే నగదు జమచేసి అనుమతించిన దాని కంటే అదనంగా ప్రైవేటు ఏజెన్సీ ఇసుకని తోడేసింది. దీనిపై ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఉపగ్రహం ద్వారా చిత్రాలను సేకరించింది. అందులో లీజు ఇచ్చిన ప్రాంతం కంటే రెట్టింపు మోతాదులో ఇసుక తవ్వకాలు జరిగినట్లు స్పష్టమైంది. దీనిపై ఏమి చర్యలు తీసుకొన్నారని సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్ర మైనింగ్ అధికారులను బుధవారం ప్రశ్నించారు. కేవలం ఏడాది వ్యవధిలోనే వీర్లపాలెంలో లక్షల టన్నుల ఇసుకని తరలించేశారని నివేదించారు. దీని వలన రూ. కోట్ల నష్టం ప్రభుత్వ ఖజానకు వాటిల్లింది. ఈ అక్రమాలకు సంబంధించి కేసులు నమోదుచేయడమే కాకుండా, రెవెన్యూ రికవరీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. దీంతో అప్పట్లో గుంటూరు జిల్లా మైనింగ్ అధికారులుగా పని చేసిన వారి గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయి.

గిరిజనుల సంక్షేమమే అజెండా

● నాటి ప్రభుత్వంలో నిలిచిన సేవలన్నీ త్వరలో పునరుద్ధరణ

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్

గుంటూరు, జూలై 31: గిరిజనుల సంక్షేమమే తమ అజెండా అని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్ తెలిపారు. బుధవారం ఆయన గుంటూరులో విలేకర్లతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించి గిరిజనుల సంక్షేమానికి బాటలు వేయడానికి ప్రణాళికలు రూపొందించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో గిరిజన పుత్రులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని, ఎస్టీ కార్పొరేషన్, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్, నిరుద్యోగ యువత నైపుణ్య శిక్షణ ఊసే లేకుండా గిరిజనులను అన్ని విధాలుగా మోసం చేశారన్నారు. రోడ్లు లేక గిరిజనులు అత్యవసర పరిస్థితుల్లో డోలీలు కట్టుకుని కొండలు, గుట్టలు దాటాల్సి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారి నోచుకోని గ్రామాలకు కచ్చా రోడ్ల స్థానంలో తారు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. కొండ కోనల్లో కష్టాలతో సహవాసం చేస్తున్న గిరిజనులకు మేలు చేసేలా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. గిరిజన పుత్రులకు ఆరోగ్య భరోసా కలిపిస్తూ 543 గిరిజన పాఠశాలలు, ప్రీ, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో ఏఎన్ఎం సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. 2014-2019 మధ్య అమలై ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన ఆదివాసి గర్భిణీ వసతి గృహాల పునరుద్ధరణ, గిరిజన తండాలలో డోలి మోతలు కనిపించకూడదని చంద్రబాబు ఆదేశించారన్నారు. ఎన్ని అవసరమైతే అన్ని చోట్లా ఫీడర్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ధారూనాయక్ తెలి పారు. గిరిజన యువతను సరైన మార్గంలో నడిపించటానికి, ఉపాధి కల్పనకు యూత్ ట్రైనింగ్ సెంటర్స్‌లో నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు ధారునాయక్ తెలిపారు.

వైసీపీ హయాంలో ఇరిగేషన్ వ్యవస్థ అస్తవ్యస్తం



చీకటీగలపాలెం గ్రామం వద్ద గుండ్లకమ్మను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల, ప్రక్కనే ఎమ్మెల్యే జీవీ

● ఐదేళ్ల కాలంలో కాలవలపై తట్ట మట్టి వేయని వైనం

● రూ.18 వేల కోట్లు బిల్లులు పెండింగ్‌లో..

● గుండ్లకమ్మకు మెయిన్‌కెనాల్ నుంచీ తూము ఏర్పాటు చేస్తాం

● నీటి పారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

వినుకొండ, జూలై 31: ఐదేళ్ళ వైసీపీ పాలనలో ఇరిగేషన్ వ్యవస్థ అస్తవస్తమైదని, అప్పటి సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రంలోని ఏ తాగు నీటి ప్రాజెక్టులపై దృష్టి పెట్టలేదని, మరమ్మతుల నిమిత్తం కాలవపై కనీసం తట్ట మట్టి వేసిన పాపాన పోలేదని భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జలహారతి కార్యక్రమం నిమిత్తం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శ్రీశైలం రానున్న నేపథ్యంలో బుధవారం ఏర్పాట్ల పరిశీలన కోసం మంత్రి నిమ్మల శ్రీశైలం వెలుతూండగా వినుకొండలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు చీకటీగలపాలెం, అడ్డరోడ్డువద్ద గల గుండ్లకమ్మ నదిని పరిశీలించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ..

నీటి పారుదలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన 45 రోజుల్లో తాను ఉత్తరాంధ్ర పెన్నా, రాయలసీమ నీటి ప్రాజెక్టులను పరిశీలించాన్నారు. ఇరిగేషన్ వ్యవస్థను మాజీ సీఎం జగన్ రెడ్డి అస్తవ్యస్తం చేసి రైతులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి నిధులు సమస్యల అధికంగా ఉందని, ఐదేళ్ళ జగన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ఖాజానాపై రూ.14 లక్షలు కోట్లు అప్పులభారాన్ని మోపారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇరిగేషన్‌లో రూ.18 వేల కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అధిగమించే పనిలో ఉన్నామని తెలిపారు. పల్నాడు జిల్లా ప్రజల దాహార్తిని తీర్చాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తమ దృష్టికి తీసుకు రాగా సీఎం చంద్రబాబుతో సహకారంతో కృష్ణా రివర్ బోర్డుతో చర్చించి కుడికాలవకు 5 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు విడుదల చేయించినట్లు తెలిపారు. కృష్ణాడెల్టా నీటి ప్రాధాన్యతను సమీక్షించి సాగర్ కుడి కాలువకు నీటి విడుదల కొనసాగిస్తామని తెలిపారు.

గుండ్లకమ్మకు రైట్ కెనాల్ నుంచి తూములు ఏర్పాటు చెయ్యాలి

నియోజకవర్గంలోని గుండ్లకమ్మ నదికి, ఈపూరు చెరువుకు నాగార్జున సాగర్ మెయిన్ కెనాల్‌నుంచి నీటి విడుదలపై తూముల ఏర్పాటుకు అనుమతి కల్పించాలని మంత్రి రామానాయుడును ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారు. గతంలో కనుమల చెరువు, కంచర్ల చెరువుకు ఏవిధంగా ఎన్నెస్పీ నుంచి తూము అనుమతి ఇచ్చారో అదేవిదంగా దీనికి అనుమతివ్వాలని కోరారు. గుండ్లకమ్మ పరివాహక గ్రామాలకు రక్షిత మంచినీటి పథకాలు, గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలలకు మంచినీటి పథకాలు ఉన్నాయని, వేసవి సయయంలో గుండ్లకమ్మ ఎండిపోయి తాగు నీరులేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రి దృష్టికి తెచ్చారు. అలానే 36 కిలో మీటర్లు ఉన్న గుండ్లకమ్మ నదిపై అక్కడక్కడ చెక్ డామ్ నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

అనంతరం మంత్రి రామానాయుడు మాట్లాడుతూ తప్పనిసరిగి మెయిన్ కెనాల్ నుంచీ తూమ్ ఏర్పాటు చేస్తామని, అంచనాల అనంతరం గుండ్లకమ్మపై చెక్‌డ్యామ్ నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీ మండల అధ్యక్షుడు మాధినేని ఆంజనేయులు, నేతలు ముత్తినేని ఏడుకొండలు, మీసాల మురళీకృష్ణ, కర్నాటి వెంకటరెడ్డి, మద్దుకూరి రామబ్రహ్మం , పాటు నాయకులు, ఎన్నెస్పీ అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆలోచనాశక్తి, సామర్థ్యాలు వృద్ధి

● గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

● ఉమ్మడి రాష్ట్రాల బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం

గుంటూరు(తూర్పు), జూలై 31: క్రీడలతో విద్యార్థుల్లో ఆలోచన శక్తి, ఇతర సామర్థ్యాలు పెంపొందుతాయని గుంటూరుజిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అన్నారు. గుంటూరు రూరల్, నల్లపాడు, లయోలా పాఠశాలలో మూడు రోజుల పాటు జరిగే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రీజియన్ ఐసీఎస్ఈ పాఠశాలల బాలికల బాస్కెట్‌బాల్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ బాలికలు క్రీడల పోటీలలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. విద్యార్థి స్థాయి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఎమెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ బాలికలు సామర్థ్యం కల్గిన బాస్కెట్‌బాల్ పోటీలను ఎంపిక చేసుకోవడం అభినందనీయమని అన్నారు. ప్రతిభకలిగిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ డాక్టర్ పీ. ఆంటోని మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే పోటీల్లో ఉమ్మడి రాష్ట్రానికి చెందిన 45 జట్లు పాల్గొంటున్నాయని వివరించారు. కార్యక్రమంలో లయోలా, స్టైమ్, లిటిల్ ఫ్లవర్, హోలీఫ్యామిలి (సత్తెనపల్లి) పాఠశాలల ప్రిన్సిపాల్స్ సురేష్, భరత్ రెడ్డి, ఎస్.సవేరి, విజయరాణి, వైస్ ప్రిన్సిపాల్ నరేష్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే రామాంజనేయులు

టీడీపీ కార్యకర్తపై కత్తితో దాడి

● తృటిలో తప్పించుకున్న వైనం .. పోలీసులకు ఫిర్యాదు

మాచవరం, జూలై 31: వైసీపీకి కార్యకర్త షేక్‌మాబూవలి తనపై కత్తితో దాడచేశాడని టీడీపీకి చెందిన దరియావలి బుధ వారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తురకపాలెం గ్రామంలో వైసీపీ కార్యకర్త షేక్ మాబూవలి, అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ దరియావలిపై కత్తితో దాడికి యత్నించాడు. అయితే చాకచక్యంగా అతను తప్పించుకున్నాడు. తురకపాలెంలోవున్న వైసీపీ కార్యకర్తకు సంబంధించిన చికెన్‌స్టాల్‌ను దరియావలి మూయించాడనే నెపంతో దరియా వలిపై ఈ దాడికి పాల్పడ్డట్టు తెలిసింది. గతంలో ఇదే వైసీపీ కార్యకర్త గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై కొడవలితో దాడిచేసి చేతికి గాయం చేశాడు. గ్రామంలో చోటు చేసుకున్న ఈసంఘటనను తెలుసుకొని అతనిని పట్టుకొని మాచవరం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. జరిగిన సంఘటనపై షేక్ దరియావలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిరాదు మేరకు విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు.

హైవేపై దారి దోపిడీ

● రూ. 4 లక్షలు నగదు లాక్కొని దుండగుల పరారీ

పెదకాకాని, జూలై 31 : హైవేపై కృష్ణా జిల్లా వాసి దారి దోపిడీకి గురైన సంఘటన బుధవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా జి కొండూరు చెందిన పెద్ది సుబ్బారావు అనే వ్యక్తి తాను తీసుకున్న అప్పులు తీర్చే నిమిత్తం పెదకాకాని లోని తన కుమార్తె ఇంటికి వచ్చాడు. పత్తిపాడు గ్రామ సమీపంలోని కోయవారిపాలెంలో డబ్బులు ఇచ్చేందుకు పెదకాకాని నుండి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన సుబ్బారావును తక్కెళ్ళపాడు రోడ్డు సమీపంలో వెనుక నుంచి వస్తున్న ఒక వ్యక్తి అడ్డగించాడు. కిందపడ్డ తన ఏటీఎం కార్డు తీసుకున్నామంటూ సుబ్బారావు గొడవ దిగి, అతని వద్ద ఉన్న రూ.4 లక్షల నగదును లాక్కుని పరారయ్యాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని

యువకుడి ఆత్మహత్య

బొమ్మలరామారం, జూలై31: పాఠశాలకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించటంతో కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మల్యాల గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఏఎస్‌ఐ అంజయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుజిల్లా రెంటచింతలకు చెందిన దావీదు 16 సంవత్సరాలుగా మల్యాల గ్రామ పరిధిలోని మామిడి తోటలో పని చేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ముగ్గురు కుమారులు కాగా, పెద్ద కుమారుడు బీటెక్, రెండో కుమారుడు డిగ్రీ చదువుతున్నారు. చిన్న కుమారుడు చంద్రశేఖర్(13) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఉదయం 8గంటలకు పాఠశాలకు వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో బయలుదేరాడు. 10గంటల సమయంలో సమీపంలో ఉన్న మామిడితోటలో చెట్టుకు చంద్రశేఖర్ వేలాడుతుండటాన్ని చూసిన స్థానికులు తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తల్లిదండ్రులు కిందికి దించగా, అప్పటికే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 31: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటిమట్టం బుధవారం నాటికి 526.80 అడుగులు ఉంది. ఇది 161.96 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 900 క్యూసెక్కులు, కుడి కాలువ ద్వారా 5944 క్యూసెక్కులు, మొత్తం అవుట్‌ఫ్లో వాటర్‌గా 6844 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2,18,622 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

2న జాబ్‌మేళా

గుంటూరు(విద్య),జూలై 31: జిల్లా ఉపాధి కార్యాలయం (గుజ్జనగుండ్ల) ఆధ్వర్యంలో ఈనెల 2న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి కే.రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఫెయిర్ డీలర్ కాపిటల్, హెచ్1హెచ్ఆర్ సొల్యూషన్స్, క్యాప్‌స్టోర్ సర్వీసెస్ తదితర కంపెనీలు హాజరుకానున్నట్లు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తిచేసి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సుగల అభ్యర్థులు జాబ్‌మేళాకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హతవున్న వారు బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాలతో ఈనెల 2న ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, ఇతర వివరాల కోసం గుంటూరు గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దూరవిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

సార్వత్రిక విద్యాపీఠం(ఏపీ ఓఎస్ఎస్) ఆధ్వర్యంలో దూర విద్య విధానంలో పది, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుంటూరుజిల్లా విద్యాశాఖాధికారి పీ.శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఈనెల 28లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు పంపాలని సూచించారు. అడ్మిషన్ ఫీజు ఇతర వివరాల కోసం www.apopenschool.gov.in అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేడు రాజధాని అమరావతిలో

జంగిల్ క్లియరెన్స్ టెండర్ ఓపెన్

విజయవాడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధానిలో పిచ్చి, కంప చెట్ల తొలగింపునకు రూ.36.50 కోట్ల వ్యయంతో పిలిచిన టెండర్లను గురువారం సీఆర్‌డీఏ తెరవనుంది. వాస్తవానికి ఈ నెల 25నే టెండర్లను తెరవాల్సి ఉండగా.. 29 వరకు పొడిగించారు. తర్వాత మరో రెండు రోజులు పొడిగించారు. కాంట్రాక్టర్ల సందేహాలను నివృత్తి చేసేందుకే టెండర్ల గడువును పొడిగించినట్టుగా తెలుస్తోంది. గురువారం సాయంత్రంలోపు పిచ్చి, కంప చెట్ల తొలగింపునకు కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసే అవకాశం ఉంది.

జనసేన కార్యకర్తపై వైసీపీ నేతల దాడి

గురజాలటౌన్, జూలై 31: జనసేన కార్యకర్తపై వైసీపీ నేతలు దాడి జరిపిన సంఘటన గురజాల పట్టణంలో బుధవారం జరిగింది. పట్టణానికి చెందిన జనసేన కార్యకర్త పొలిశెట్టి కార్తీక్ తన స్నేహితుడిని కలిసి వస్తుండగా దండివాగు బ్రిడ్జివద్ద వైసీపీ నేతలు సుమారు 8మంది అతనిపై రాడ్లతో దాడిచేశారు. ఇంతలో స్థానికులు అక్కడకు చేరుకోవడంతో వారు పరారయ్యారు. గాయాలపాలైన కార్తీక్‌ను పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన చికిత్స కోసం నరసరావుపేటకు రిఫర్ చేశారు. కాగా దాడిచేసిన వైసీపీ నేతలు దాచేపల్లి మండలం కొత్తూరుకు చెందిన వారని సమాచారం. కార్తీక్ ఫిర్యాదు మేరకు జక్కా అశోక్, బొజ్జా ప్రసాద్‌తోపాటు మరో 8 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ బాలకృష్ణ తెలిపారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



పుట్టా నాగరాజు

ప్రత్తిపాడు, జూలై 31: అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండల పరిధిలోని చినకోండ్రుపాడులో జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చినకోండ్రుపాడు గ్రామానికి చెందిన పుట్ట నాగరాజు (40) గత ఏడాది ఆరు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని అందులో మూడు ఎకరాల మిర్చి, రెండు ఎకరాల పత్తితో పాటు ఒక ఎకరంలో కూరగాయలు సాగు చేశాడు. ఈ భూమికి కౌలుతో పాటు సాగు చేయడం కోసం తన ఇంటిని తాకట్టు పెట్టి రూ.13 లక్షలు అప్పు చేశాడు. గత ఏడాది పంటలు సరిగా పండక అప్పుల్లో మునిగి పోవడం, ఇదే తరుణంలో ఈ ఏడాది రెండు ఎకరాలు సాగుకు కౌలుకు తీసుకున్నాడు. అప్పులు తీర్చలేననే మనస్థాపంతో మంగళవారం తాను కౌలుకు తీసుకున్న పొలాన్ని దున్నిస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన నాగరాజు కూల్‌డ్రింగ్‌లో పురుగుమందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం మధ్యాహ్నం సమయంలో పసువులు కాసే మహిళ జాతీయ రహదారికి పక్కన ఉన్న శ్రీనాధ్ ప్లాట్స్‌కి సమీపంలో ఒక వేపచెట్టు కింద మృతదేహాన్ని గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నాగరాజు భార్య రాజకుమారి ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00



చెక్కు అందచేస్తున్న మంత్రి మనోహర్, సర్పంచ్ రమాదేవి, ఎంపీడీవో శిల్ప తదితరులు

మహిళల ఆర్థికాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

● పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

● ఎస్‌హెచ్‌జీ మహిళలకు బ్యాంకు రుణాలు పంపిణీ

తెనాలి రూరల్, జూలై 31: మహిళలు స్వయం సహాయక సంఘాలుగా ఏర్పడి చిన్నపాటి పరిశ్రమలు స్థాపించి వివిధ వ్యాపారరంగాల్లో అగ్రగాములుగా నిలుస్తూ ఆర్థికాభ్యున్నతిని సాధించేలా కృషి చేయటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం మండలంలోని పెదరావూరు గ్రామంలో ఓ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఎస్‌హెచ్‌జీ మహిళలకు బ్యాంకు రుణాలు పంపిణీ కార్యక్రమానికి మంత్రి మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని 38 స్వయం సహాయక సంఘ గ్రూపులకు గానూ రూ. 5 కోట్ల 37 లక్షల చెక్కును మంత్రి మనోహర్ మహిళా సంఘాల గ్రూపులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా కోలుకోలేని దెబ్బతీశాడని ఆరోపించారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా మహిళా సాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు పనిచేస్తున్నారన్నారు. అందులో భాగంగానే మహిళల స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు అందజేస్తున్నట్లు తెలిపారు. పొదుపులో మహిళలకు మించిన వారే లేరని వచ్చిన రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో జరగబోయే అభివృద్ధి కార్యక్రమాలను మహిళలకు వివరించారు. గత ప్రభుత్వంలో నిత్యవసరాల ధరలు ఆకాశాన్నంటాయని కూటమి ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో నాణ్యమైన కందిపప్పు, బియ్యం వంటివి ప్రత్యేక స్టాల్స్ ద్వారా సబ్సిడీతో అందిస్తున్నామన్నారు. మధ్యాహ్నభోజన పథకం ద్వారా విద్యార్థులకు అందించే ఆహారంపై దృష్టిపెట్టామని మరి కొద్దిరోజుల్లో మరింత నాణ్యతా ప్రమాణాలతో కూడిన పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ కాకి రమాదేవి, ఎంపీడీవో కానూరు శిల్ప, గ్రామ కార్యదర్శి రామసుబ్బారావు, పలు శాఖల అధికారులు, సిబ్బంది, మండలంలోని సంఘాల మహిళలు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

రేంజ్‌లో భారీగా సీఐల బదిలీలు

● తొలి జాబితాలో 24 మంది సీఐలకు పోస్టింగ్స్

● 15 మందిని వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు

గుంటూరు, జూలై 31: ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న సీఐల బదిలీలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ మేరకు బుధవారం రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేసారు. తొలి జాబితాలో 24 మందికి పోస్టింగ్స్ ఇచ్చారు. అదేవిధంగా 15 మందికి ఎటువంటి పోస్టింగ్స్ ఇవ్వకుండా రేంజ్ విఆర్‌కు పిలిచారు. ఇందులో ఒకరిద్దరి సీఐల పోస్టింగ్స్‌పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయా ఎమ్మెల్యేల సిఫార్సుల ఆధారంగా పోస్టింగ్స్ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో పలు చోట్ల పనిచేసిన వారికీ ఈ దఫా పోస్టింగ్ లభించడంపై విస్మయం వ్యక్తమవుతోంది. వారిలో కొందరు గత ప్రభుత్వంలో తటస్థంగా చేసినప్పటికీ, కొందరు మాత్రం గత ప్రభుత్వానికి అనుకూలంగా పని చేసినప్పటికీ వారికి ఎలా పోస్టింగ్ లభించిందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆయా సీఐలు స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రసన్నం చేసుకున్నప్పటికీ వారు ఎలా సిఫార్సు చేసారనేది చర్చనీయాంశంగా మారింది. బదిలీ అయిన సీఐల పేరు, ప్రస్తుత స్థానం, బదిలీ అయిన స్థానం వివరాలు..

టి విజయకృష్ణ - సీసీఎస్, ఒంగోలు - రాపూరు సర్కిల్, నెల్లూరు జిల్లా, పి సుబ్బారావు - రేంజ్ విఆర్, గుంటూరు - వెంకటాచలం సర్కిల్, నెల్లూరు జిల్లా, మారీడు శ్రీనివాసరావు - రేంజ్ విఆర్, గుంటూరు - చీరాల 1టౌన్, బాపట్ల, ఎం. విజయ్ చరణ్ - సోషల్ మీడియా, సైబర్ క్రైం, పల్నాడు - నరసరావుపేట 1 టౌన్, పల్నాడు, యు.శోభన్ బాబు - స్పెషల్ బ్రాంచ్ 2, పల్నాడు - వినుకొండ టౌన్, పల్నాడు, పసుపులేటి రామకృష్ణ - వేమూరు సర్కిల్, బాపట్ల- నరసరావుపేటరూరల్ సర్కిల్, పల్నాడు, బి.సుబ్బానాయుడు - ఎస్సీఎస్టీ సెల్,పల్నాడు - చిలకలూరిపేట సర్కిల్ , పల్నాడు, కె.వెంకట ప్రసాద్ - స్పెషల్ బ్రాంచ్ 3, గుంటూరు - అచ్చంపేట, పల్నాడు, ప్రత్తిపాటి సురేష్ - రేంజ్ విఆర్ - పెదకూరపాడు, పల్నాడు, పొలూరి శ్రీనివాస్ - సత్తెనపల్లిటౌన్, పల్నాడు - సత్తెనపల్లి రూరల్, మోర్వనేని సుబ్బారావు - చీమకుర్తి (అటాచ్‌మెంట్) - చీమకుర్తి, ప్రకాశం, సీహెచ్ హజరత్తయ్య - దిశ, బాపట్ల - సింగరాయకొండ, ప్రకాశం, వై.నాగరాజు - రేంజ్ విఆర్, గుంటూరు - ఒంగోలు 1 టౌన్, ప్రకాశం, కె. అజయ్ కుమార్ - మహిళా పీఎస్, నెల్లూరు -ఒంగోలు తాలూకా, ప్రకాశం, పి.వెంకటనారాయణ - నెల్లూరు(వేదాయపాలెం) 5వ పట్టణం - కలిగిరి సర్కిల్, నెల్లూరు, ఎ. మల్లికార్జునరావు - రేపల్లె రూరల్ సర్కిల్, బాపట్ల - రేపల్లె టౌన్, బాపట్ల, పి. కిరణ్ - రేంజ్ విఆర్, గుంటూరు- పట్టాభిపురం, గుంటూరు, ఎం.శేషగిరిరావు - రేంజ్ విఆర్, గుంటూరు - మార్టూరు, బాపట్ల, కాకుమాను వెంకటరావు - సీసీఎస్, గుంటూరు - సంతమాగులూరు సర్కిల్, బాపట్ల, కొంకా శ్రీనివాస్- అరండల్ పేట (అటాచ్‌మెంట్) - అరండల్‌పేట, గుంటూరు, డి.వినోద్ కుమార్ - మంగళగిరి టౌన్(అటాచ్‌మెంట్) - మంగళగిరి టౌన్, గుంటూరు, యార్లగడ్డ శ్రీనివాసరావు - మంగళగిరి రూరల్(అటాచ్‌మెంట్) - మంగళగిరిరూరల్, గుంటూరు, కె.వంశీధర్ - నల్లపాడు(అటాచ్‌మెంట్) - నల్లపాడు, గుంటూరు, చిట్టెం కోటేశ్వరరావు - సీసీఎస్, నెల్లూరు - నెల్లూరు 1 టౌన్.

రేంజ్ విఆర్‌కు పిలిచిన సీఐల వివరాలు ఇలా ఉన్నాయి.

పి.శేషగిరిరావు (చీరాల 1టౌన్, బాపట్ల), సి.కృష్ణారెడ్డి (నరసరావుపేట టౌన్, పలనాడు), సిరిగిరి సాంబశివరావు (వినుకొండటౌన్), కె. మల్లికార్జున (నరసరావుపేటరూరల్ సర్కిల్, పల్నాడు), పి.శ్రీనివాస రెడ్డి(చిలకలూరిపేట రూరల్ సర్కిల్, పల్నాడు), కరీముల్లా షావలి(అచ్చంపేట), జి. మంగారావు (పెదకూరపాడు, పల్నాడు), ఎం.రాజేష్‌కుమార్ (సత్తెనపల్లిరూరల్), డి.రంగనాథ్ (సింగరాయకొండ, ప్రకాశం), ఎండి ఫిరోజ్ (కలిగిరి సర్కిల్ నెల్లూరు), ఎం.నజీర్ బేగ్ (రేపల్లెటౌన్, బాపట్ల), ఎస్ విజయచంద్ర (పట్టాభిపురం), ఎస్‌వి రాజశేఖర్‌రెడ్డి (మార్టూరు,బాపట్ల), కెనరసింహారావు (సంతమాగులూరు సర్కిల్, బాపట్ల), బి అశోక్‌కుమార్(నెల్లూరు 1 టౌన్, నెల్లూరు).

6న గద్దర్, చుండూరు అమరవీరుల సంస్మరణ సభలు

గుంటూరు(తూర్పు), జూలై 31: చుండూరు అమరవీరుల వర్ధంతి, ప్రజా యుద్ధం ఒక గద్దర్ ప్రథమ వర్ధంతి సభ ఆగస్టు 6వ తేదీ, సాయంత్రం 4 గంటలకు స్థానిక బ్రాడీపేట, కొరటాల భవన్‌లో నిర్వహిస్తున్నట్టు ప్రజా సంఘాల నేతలు తెలిపారు. సభకు సంబంధించిన పోస్టర్లను బుధవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాశీం, కవి, సాహితీ విమర్శకులు ప్రొఫెసర్ జీ.లక్ష్మీనరసయ్య, వెంకటేశ్వర యూనివర్సిటీ ప్రొఫెసర్ జి.శౌరయ్య, సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరావు హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో శిఖా సురేష్, సాదు మాల్యాద్రి, వేల్పూరి నరసింహారావు, పాగళ్ల ప్రకాష్, గంటా ప్రభుదాసు పాల్గొన్నారు.

41,608 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 43,934 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 41,608 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 19,806 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	17000	334	9000	12000
నెంబరు. 5	9000	12500	నెంబరు. 5	–	–
273	10000	11000	273	9500	10000
341	9000	16000	341	10000	15500
4884	--	–	4884	13000	14000
సూపర్ 10	--	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18600	తేజ	9000	18600
బ్యాడిగి	8500	16300	బ్యాడిగి	9000	14000
దేవనూరు డీలక్స్	10000	13500	దేవనూరు డీలక్స్	10000	14000
తెల్లకాయలు	4500	12000	తెల్లకాయలు	5000	11000

పెన్షన్‌ల పంపిణీలో పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



బాపట్ల, జూలై 31 : పెన్షన్‌ల పంపిణీలో పార్టీశ్రేణులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పిలుపునిచ్చారు. ఈ విషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెద్దన్నగా ప్రతినెల ఒకటవ తేదీన ఇంటి వద్దకు పింఛన్‌లు అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వ అధికారులు, పార్టీ శ్రేణులు ఇంటింటికి తిరిగి పెన్షన్‌లు పంపిణి చేసి లబ్ధిదారులకు భరోసా కల్పించాలన్నారు. బాపట్ల నియోజకవర్గంలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల లోపు పెన్షన్‌ల పంపిణీ మొత్తం పూర్తి చేయాలన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ పెంచి ఇస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో వార్డు ప్రెసిడెంట్‌లు, పంచాయతీ సర్పంచ్‌లు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

● పిట్టలవానిపాలెం, జూలై 31 : మండలపరిధిలోని 12 గ్రామసచివాలయాలలో ఈనెల 1న ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లు కార్యక్రమం లబ్ధిదారులకు పంపిణి జరుగుతుందని ఎంపీడీవో బీవీ రమణమూర్తి తెలిపారు. ఆయా గ్రామసచివాలయాలలో ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పింఛన్ పంపిణి కార్యక్రమానికి ప్రత్యేకాధికారులుగా పిట్టలవానిపాలెం, జీఎస్‌పాలెం, మంతెనవారిపాలెం, గ్రామసచివాలయాలకు మండల విద్యాశాఖాధికారి -1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు, అల్లూరు, ఖాజీపాలెం, పోతనకట్టవారిపాలెం ప్రత్యేకాధికారి ఈవోపీఆర్డీ కె.పద్మజ, చందోలు -1,2 గ్రామసచివాలయాలకు, ఏపీఎం సంతోష్‌కుమార్, సంగుపాలెం, కోమలి గ్రామసచివాలయాలకు ఎంఈవో-2 కె.రాజారత్నం, భవనంవారిపాలెం, పిట్టువారిపాలెం గ్రామసచివాలయాలకు మండల వ్యవసాయాయశాఖాధికారి సీహెచ్ సత్యానందం పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని ఎంపీడీవో తెలిపారు.

● వేమూరు, జూలై 31 : మండల పరిధిలోని 17 గ్రామాల్లో పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం చేసినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. 7340మంది లబ్ధిదారులకు ఉండగా ఒక్కొక్క ఉద్యోగికి 50మందిని కేటాయిస్తూ 146మంది ఉద్యోగులకు పంపిణీ బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు. మొత్తం మూడు కోట్ల 12 లక్షల 13,500 రూపాయలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేడు రెండు గ్రామాల్లో ఎమ్మెల్యే ఆనందబాబు పర్యటన

వేమూరు, జూలై 31 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు గురువారం వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నియోజకవర్గంలోని రెండు గ్రామాల్లో పర్యటించనున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన చేతుల మీదుగా పెన్షన్లు అందించనున్నారు. అమృతలూరు మండలం కూచిపూడి గ్రామంలో ఉదయం 10గంటలకు, వేమూరు మండలం పెరవలిపాలెం గ్రామంలో 10.30 గంటలకు హాజరై ప్రజలను ఉద్దేశించి కూటమి ప్రభుత్వం తీసుకున్న ప్రజాహితమైన నిర్ణయాలు వివరించనున్నారు.

బాపట్ల తహసీల్దార్‌గా కృష్ణకాంత్



కృష్ణకాంత్

బాపట్ల, జూలై 31 : బాపట్ల తహసీల్దార్‌గా పి.కృష్ణకాంత్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ శాఖలో 22 సంవత్సరాలుగా పని చేస్తున్న ఆయన వేటపాలెం తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై బాపట్ల వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ బదిలీపై వెళ్ళటంతో ఆయన స్థానంలో కృష్ణకాంత్ బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది సహకారంతో రెవెన్యూ సమస్యలు పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు.

రేపల్లె తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



మోర్ల శ్రీనివాసరావు

రేపల్లె, జూలై 31 : రెవెన్యూ పరిధిలోని సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని రేపల్లె తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు అన్నారు. రేపల్లె తహసీల్దార్‌గా మోర్ల శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నగరంలో పని చేశానని రేపల్లె ప్రాంతంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

వేమూరు తహసీల్దార్‌గా సుశీల



బి.సుశీల

వేమూరు, జూలై 31 : మండల తహసీల్దార్‌గా బి.సుశీల బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన విభాగంలో పని చేసిన ఆమె ఎన్నికల ముందు చీరాల డివిజన్లోని కొరిశపాడు మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరావు వద్ద నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల డిటి శ్రీనివాసరావు, డిప్యూటీ తహశీల్దార్ కనకదుర్గ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీజ, కార్యాలయ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

భట్టిప్రోలు తహసీల్దార్‌గా శ్రీనివాసరావు



బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాసరావు

భట్టిప్రోలు, జూలై 31 : మండల తహసీల్దార్‌గా మేకా శ్రీనివాసరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధులకు వచ్చిన తహసీల్దార్ తిరిగి వెళ్ళడంతో డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న శ్రీనివాసరావు ఇన్‌ఛార్జ్ తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. మేకా శ్రీనివాసరావును (ఎఫ్ఏసీ)గా నియమించడంతో బుధవారం బాధ్యతలు చేపట్టారు. కార్యాలయ సిబ్బంది శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

చుండూరు తహసీల్దార్‌గా మల్లికార్జునరావు



తహసీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

చుండూరు, జూలై 31 : తహసీల్దార్‌గా దేవిశెట్టి మల్లికార్జునరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీరు ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తూ తహసీల్దార్‌గా చుండూరుకు బదిలీ అయ్యారు. గతంలో రేపల్లె, అమృతలూరు తహసీల్దార్‌గాను, మంగళగిరి, గుంటూరు, తెనాలి రెవెన్యూ కార్యాలయాల్లోను పని చేశారు. కార్యాలయం పరిధిలో ఎలాంటి అవినీతికి ఆస్కారాలు లేకుండా సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. పలువురు వీఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆయనను కలసి అభినందనలు తెలిపారు.

అమృతలూరు తహసీల్దార్‌గా నెహ్రూబాబు



తహసీల్దార్ నెహ్రూబాబుకు స్వాగతం పలుకుతున్న డీటీ శివయ్య, ఆర్ఐ ఫణీంద్రబాబు

అమృతలూరు, జూలై 31 : అమృతలూరు తహసీల్దార్‌గా కూచిపూడి నెహ్రూబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల్లో బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చిన కవితను బాపట్ల కలెక్టర్ కార్యాలయంలో భూసేకరణ విభాగానికి బదిలీ చేశారు. దీంతో వట్టిచెరుకూరు మండలం తహసీల్దార్‌గా పని చేస్తున్న నెహ్రూబాబును అమృతలూరు బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ శివయ్య, ఆర్ఐ ఫణీంద్రబాబు తదితరులు స్వాగతం పలికారు. ప్రజలకు అందుబాటులో ఉంటానని, రైతుల సమస్యలపై సత్వరమే స్పందిస్తానని ఆయన చెప్పారు.

కర్లపాలెం తహసీల్దార్‌గా వెంకటరత్నం



తహసీల్దార్ వెంకటరత్నంను సన్మానిస్తున్న సిబ్బంది

కర్లపాలెం, జూలై 31 : కర్లపాలెం మండల నూతన తహసీల్దార్‌గా ఎస్.వెంకటరత్నం బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్‌ను డిప్యూటీ తహసీల్దార్ సలీమా, మండలంలోని వీఆర్వోలు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో తహసీల్దార్ వెంకటరత్నం సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి పనులు కోసం వచ్చిన ప్రజలు దగ్గర లంచాలు ఆశించవద్దని, తాను కూడా ప్రజలకు పనులను వెంటనే చేసి పంపుతానని వీఆర్వోలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ అంబటి శ్రీకాంత్, డీటీలు సలీమా, వీఆర్వోలు శివారెడ్డి, నాగరాజు, పోతురాజు, భవానీ, కావ్య, సాంబయ్య, సాహిదుల్లా, సుధాకర్‌రెడ్డి, యువనాగరాజు, సుకన్య, షేక్ సుభానీ, చందు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి దర్శినిపై సంక్షిప్త నివేదిక తయారు చేయాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 31 : జిల్లా అభివృద్ధి భవిష్యత్తు దర్శినిపై సంక్షిప్త నివేదిక తయారు చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి ఆదేశించారు. బాపట్ల జిల్లా అభివృద్ధిపై అన్ని శాఖల జిల్లా అధికారులతో బుధవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. బాపట్ల అభివృద్ధికి ముఖ్యమైన ఆక్వాపార్క్, నిజాంపట్నం పోర్ట్ విస్తరణ, ఓడరేవు విస్తరణ, చేనేత పార్క్, బీచ్‌ల అభివృద్ధి, వైద్యకళాశాల నిర్మాణాలపై నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ చెప్పారు. బాపట్లలో అభివృద్ధి చేయాల్సిన అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలలో భవనాలు అత్యవసరంగా నిర్మించే అంశాలపై నివేదిక ఇవ్వాలన్నారు. జిల్లాలోని ప్రధాన రహదార్లను కలుపుతూ 80కిలోమీటర్ల మేర ఆర్అండ్ బి రహదారి నిర్మాణానికి రూ.83కోట్లు మంజూరుపై నివేదిక ఇవ్వాలన్నారు. బాపట్లలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రెండో సమ్మర్‌స్టోరేజి ట్యాంక్ అవసరతపై నివేదిక పంపాలన్నారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి కొరకు అంచనాలను ప్రభుత్వానికి పంపించాలని చెప్పారు. నూతన జిల్లాగా ఏర్పడిన బాపట్లకు జిల్లా అధికారులు, సిబ్బంది, నిధుల కొరత అధికంగా ఉందన్నారు. ఈవిషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలన్నారు.

● బాపట్లలోని నిరుద్యోగయువతకు నైపుణ్య శిక్షణలిచ్చి ఉపాధికల్పించటమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ జె.వెంకటమురళీ తెలిపారు. నిరుద్యోగ యువతను గుర్తించే అంశాలపై ప్రణాళిక రూపొందించాలన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా లబ్ధి పొందే విద్యార్థుల సంఖ్య, నిధుల అవసరత, ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్‌లను ఇవ్వటానికి ఎంత నిధులు ఖర్చుఅవుతాయో ప్రాథమిక అంచనాలు రూపొందించాలన్నారు. ప్రతి మహిళకు 15వేలు చొప్పున ప్రభుత్వం నిధులు ఇవ్వటానికి ఏమేరకు అవరమౌతాయో అనే అంశాలపై అంచనాలు తయారు చేయాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ఆక్యూపెన్సీ రేషియో ఆధారంగా ప్రాథమిక నివేదిక, రైతులకు ప్రభుత్వం ఇవ్వనున్న నగదుపై ప్రాథమిక ప్రణాళిక రూపొందించి నివేదిక పంపాలని ఆయన సూచించారు. ఎన్టీఆర్ పింఛన్ నగదు పంపిణి కార్యక్రమాన్ని అధికారులు సమర్ధవంతంగా చేపట్టాలన్నారు.

● ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను అధికారులతో కలిసి ఆయన విడుదల చేశారు. ముర్రుపాలు ప్రాధాన్యతపై మహిళలందరికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్.సత్తిబాబు, వివిధ జిల్లా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన తెలుగుదేశం ప్రభుత్వం

● టీడీపీ బాపట్ల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సలగల



సలగల రాజశేఖర్

బాపట్ల, జూలై 31 : తెలుగుదేశం ప్రభుత్వం పేదల పక్షాన పని చేస్తుందని బాపట్ల పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర్ అన్నారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గృహనిర్మాణానికి గత ప్రభుత్వం సెంటుభూమి చొప్పున ఇస్తే తెలుగుదేశం ప్రభుత్వం పట్టణ పేదలకు 2 సెంట్లు, గ్రామీణ ప్రాంత పేదలకు 3 సెంట్లు ఇవ్వాలనే నిర్ణయం తీసుకోవటం హర్షణీయమన్నారు. గృహనిర్మాణానికి 4 లక్షల రూపాయలు ఇవ్వటం సంతోషదాయకమన్నారు. ఇప్పటికే పెన్షన్ పెంచి పంపిణీ చేస్తున్న ప్రభుత్వం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి ప్రజలకు మేలు చేశారన్నారు. ఈ విధంగా తెలుగుదేశం ప్రభుత్వం ప్రజాక్షేమం, మేలు కోసం కృషి చేసే ప్రజాప్రభుత్వమని అన్నారు. దోపిడీదారుల నుంచి రాష్ట్రాన్ని కాపాడి ప్రజలకు మేలు చేస్తూ భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన తెలిపారు.

సమాధులతోట సమస్య పరిష్కరిస్తా : కమిషనర్

బాపట్ల, జూలై 31 : సమాధుల తోట సమస్యను పరిష్కరిస్తానని చెంగల్రాయుడుతోట ప్రజలకు మున్సిపల్ కమిషనర్ వినిర్మల్ కుమార్ హామినిచ్చారు. శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం 33వ వార్డులోని చెంగల్రాయుడుతోట, అరవపాలెం, బాలకృష్ణాపురం, కొత్తపాలెంలో అధికారులు, నాయకులతో కలిసి కమిషనర్ పర్యటించారు. అతిపెద్ద సమాదులతోటలో తాగుబోతుల ఆగడాలు, జూదరుల వెకిలి చేష్టలు ఎక్కువయ్యాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళారు. ఇకపై అలాంటివి సాగవని ఆయన హెచ్చరించారు. వర్షాకాలంలో ప్రజలు వ్యాధుల భారినపడకుండా ముందస్తు చర్యలు చేపడుతామని చెప్పారు. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టి డ్రైనేజీలు శుభ్రం చేయిస్తామని హామినిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, సీనియర్ నాయకులు మందపాటి అంద్రేయ, మున్సిపల్ ఏఈ ఉమామహేశ్వరరావు, వార్డు పార్టీ అధ్యక్షుడు ఐనంపూడి షాలెంరాజు, పార్లమెంట్ మహిళా కార్యదర్శి కూచిపూడి ఝాన్సీరాణి, ఎస్సీ సెల్ సభ్యులు సంగీత ప్రసాద్, కూచిపూడి జాషువా, ఆడే వంశీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చెంగల్రాయుడుతోటలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ నిర్మల్‌కుమార్

గురుకుల పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలి

బాపట్ల, జూలై 31 : మండలంలోని నరసాయపాలెం గురుకుల పాఠశాలలో ఉన్న సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు కోరారు. పార్టీశ్రేణులు, దళితనాయకులతో కలిసి నరసాయపాలెంలోని పమిడి అంకమ్మ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేక పైపులైన్ ద్వారా తాగునీటి సౌకర్యం కల్పించే విధంగా ఉన్నతాధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి గుదే రాజారావు, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తురిమెళ్ళ అమ్మేశ్వరరావు, సలగల చంటిబాబు, ఏపూరి జోసఫ్ పాల్గొన్నారు.

పంటకాల్వకు మరమ్మతు పనులు ప్రారంభం

పిట్టలవానిపాలెం, జూలై 31 : పిట్టలవానిపాలెం, జీఎస్‌పాలెం, ఖాజీపాలెం గ్రామాల మీదగా వెళ్ళే పంటకాల్వల మరమ్మతు కార్యక్రమాన్ని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు బుధవారం చేపట్టారు. వేగేశన కిషోర్ రాజు ఆధ్వర్యంలో రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నూతనంగా ఏర్పాటు చేసిన ప్రొక్లెయిన్ మిషన్ యంత్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మరమ్మతు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గోకరాజు శ్రీధర్‌వర్మ, చందోలు ఇరిగేషన్ ఏఈ రవీంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు నూతన పథకాలు అమలు : ఎంఈవో

పిట్టలవానిపాలెం, జూలై 31 : గత ప్రభుత్వంలో పాఠశాలలో విద్యార్థులకు అందించే జగనన్న గోరుముద్ద పథకాన్ని మార్పు చేసి కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర విద్యాశాఖా ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నభోజన పథకం పేరుతో అమలు చేస్తున్నట్లు పిట్టలవానిపాలెం మండల విద్యాశాఖాధికారి-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని జీఎస్‌పాలెం గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన సందర్శించి మౌలికసదుపాయాలతోపాటు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

బాపట్ల, జూలై 31 : ఏరియా వైద్యశాలలోని రోగులకు జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ బుధవారం పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి తనవంతుగా వీటిని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. జనసేన నాయకులు ఆరమళ్ళ సుజిత్, కరీముల్లా, రాజేంద్రప్రసాద్, మోహన్, రత్తయ్య, మాధురి, శ్యామ్, డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

పేద విద్యార్థికి తెలుగు మహిళ చేయూత

బాపట్ల, జూలై 31 : మండలంలోని ఈతేరు గ్రామానికి చెందిన పేద విద్యార్థి చదువుకు టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, లక్ష్మీసుప్రజ చేయూతనందించారు. విద్యార్థికి అవసరమైన పుస్తకాలు, బ్యాగ్, ఇతర వస్తువులతోపాటు ఆర్థికచేయూతనందించి విద్యను కొనసాగించటానికి సహకరించారు. విద్యార్థి అమర్ చదువుకు తమ సహకారం ఉంటుందని నాగభూషణమ్మ తెలిపారు.

శ్రీనివాసరావు సేవలు అభినందనీయం : ఎస్పీ

బాపట్ల,జూలై 31 : సుదీర్ఘకాలం పోలీసు శాఖకు విశేష సేవలందించిన ఏఎస్సై కె.శ్రీనివాసరావు అభినందనీయులని ఎస్పీ తుషార్ డూడీ అన్నారు. 34 సంవత్సరాలుగా పోలీసుశాఖలో సేవలందించి ఉద్యోగవిరమణ చేస్తున్న శ్రీనివాసరావును బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సత్కరించి సన్మానించారు. పోలీసు శాఖ అన్నివిధాలా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ ఆర్ఐ డి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఏపీసీ వెంకటసుధాకర్‌కు ఘనసన్మానం

సమగ్రశిక్ష ఏపీసీగా పనిచేస్తున్న మలవతు వెంకటసుధాకర్‌ను బుధవారం ఘనంగా సన్మానించారు. బాపట్ల సీఎంవో శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో 34 సంవత్సరాలుగా ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఆయన ఉద్యోగవిరమణ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంఎంవో డాక్టర్ బిళ్ళా మోజెస్, ఇన్‌చార్జి డీఈవో గల్లా వెంకటేశ్వర్లు, ఎంఈవోలు ఎస్.నిరంజన్, దేవరకొండ ప్రసాదరావు, సమగ్రశిక్ష సిబ్బంది, యూటీఎఫ్‌నాయకులు పాల్గొన్నారు.

శేషవర్మరాజు విద్యారంగంలో విశేష సేవలు : ఎంఈవో

కర్లపాలెం, జూలై 31 : మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తూ బుధవారం పదవీ విరమణ చేసిన శేషవర్మరాజు విద్యారంగంలో విశేష సేవలందించారని మండల విద్యాశాఖాధికారి టీయూ మనోరంజనీ అన్నారు. ఆయన ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా దుశ్శాలువా, పూలమాలలు, ప్రశంసపత్రంతో శేషవర్మరాజు దంపతులను ఎంఈవోలు మనోరంజనీ, విజయశ్రీ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లె వెంకటేశ్వర్లు (ఆదం), యూటీఎఫ్, ఎస్టీయూ ఉపాధ్యాయులు సన్మానించారు.

రాజేశ్వరమ్మకు ఘనసత్కారం

పిట్టలవానిపాలెం, జూలై 31 : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించి పదవీవిరమణ చేస్తున్న ద్వారకా రాజేశ్వరమ్మ సేవలు ఎంతో అభినందనీయమని దెందుకూరి సీతారామరాజు అన్నారు. కృష్ణాజిల్లా ఘంటసాల మండలం ఎంపీడీవో భవనం మారుతిశేషమాంబ, విశ్రాంత ఎంపీడీవోలు మేరీ కమలమ్మ, బివి.రమణమూర్తి, ఈవోపీఆర్డీ కె.పద్మజ, సూపరింటెండెంట్ మధుసూధనరెడ్డిలు పదవీవిరమణ చేసిన ద్వారాకా రాజేశ్వరమ్మ పూలమాలలతో, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు.

మహమ్మద్ రఫీ విశ్వవిఖ్యాత గాయకుడు


● సప్తస్వర సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కోటిరాజ్

బాపట్ల, జూలై 31: మహమ్మద్ రఫీ విశ్వవిఖ్యాత గాయకుడని గానం గంధర్వమని వారి స్వరం భగవంతుడు ప్రసాదించిన వరమని కవిభావానికి, నటుని హావ భావాలకు అనుగుణంగా పాడేవారని సప్తస్వర సంగీత కళాశాల ప్రిన్సిపాల్ కోటిరాజ్ అన్నారు. మహమ్మద్ రఫీ 44వ వర్ధంతి సభలో బుధవారం సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ, కోశాధికారి ఆదంషఫి సంయుక్తంగా మాట్లాడుతూ మహమ్మద్ రఫీ 26 భాషల్లో దాదాపు 7,500 పైచిలుకు పాటలు పాడారని, తెలుగులోనే కాక అనేక భాషలలో పాడారని, ఆయనకు ఆరు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, ఒక జాతీయ చలనచిత్ర అవార్డు, బెస్ట్ సింగర్ ఆఫ్ ది మిలీనియం అవార్డుతోపాటు పద్మశ్రీ బిరుదుతో సన్మానింపబడ్డారని అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరమ్మ, కె.కాళీదాసు, మస్తాన్ రెడ్డి, పువ్వా వెంకటేశ్వర్లు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి తదితరులు మహమ్మద్ రఫీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శాకాంబరీదేవిగా వాసవీమాత

భట్టిప్రోలు, జూలై 31 : పవిత్ర ఆషాఢ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని గ్రామంలో ఉన్న శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని, పార్వతీ అమ్మవారిని పలు కూరగాయాలు, పూలు, పండ్లతో అలంకరించి శాకాంబరీదేవి మహోత్సవం నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం విఘ్నేశ్వరపూజ, అమ్మవార్లకు అష్టోత్తర శతనామావళితో కుంకుమపూజ అనంతరం వాసవీ అమ్మవారు, పార్వతీ అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అనంతరం దేవస్థాన ప్రాంగణంలో ఆర్యవైశ్య మహిళలచే వాసవీ అమ్మవారికి శ్రీ లలితా సహస్ర పారాయణ చేశారు.

నగరం డిప్యూటీ తహసీల్దార్‌గా సత్యనారాయణ



సత్యనారాయణ

నగరం, జూలై 31 : రేపల్లె డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.సత్యనారాయణ డిప్యూటేషన్‌పై నగరం మండల డిప్యూటీ తహసీల్దార్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎన్నికల అధికారిగా విధులు నిర్వహించిన శ్రీశిల్ప బదిలీపై వెళ్ళటంతో ఆమె స్థానంలో ఎస్.సత్యనారాయణ ఎఫ్ఏసీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం నగరం మండల ప్రాంతంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ఓపెన్ స్కూల్‌కు దరఖాస్తు చేసుకోవాలి

బాపట్ల, జూలై 31 : ఓపెన్ స్కూల్‌లో 10వ తరగతి, ఇంటర్మీడియట్ చదివేందుకు అడ్మిషన్స్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఇన్‌చార్జి డీఈవో జి.వెంకటేశ్వర్లు తెలిపారు. 2024-2025 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా అడ్మిషన్ పొందటానికి నోటిఫికేషన్ జారీ చేయటం జరిగిందన్నారు. 10వ తరగతిలో చేరటానికి 14 సంవత్సరాలు నిండినవారికి, ఇంటర్మీడియట్‌లో చేరటానికి 10వ తరగతి పాసై 15 సంవత్సరాలు నిండినవారు దరఖాస్తు చేయటానికి అర్హులు అన్నారు. జూలై 31వ తేదీ నుంచి అడ్మిషన్లు ప్రారంభమై ఆగస్టు 27 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆగస్టు 28వ తేదీ వరకు అడ్మిషన్ ఫీజు చెల్లించవచ్చని, సెప్టెంబరు 4వ తేది వరకు రూ.200 లేటు ఫీజుతో ఆన్‌లైన్‌లో అడ్మిషన్ చేసుకోవచ్చు అన్నారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.

వాహనచోదకులు హెల్మెట్ ధరించాలి : ట్రాఫిక్ ఎస్సై

బాపట్ల, జూలై 31 : ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఎస్సై సుధాకర్ తెలిపారు. హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపిన వారికి జరిమాన విధించటం జరుగుతుందన్నారు. ఈ విషయమై బుధవారం పట్టణంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా ద్విచక్రవాహనంపై ముగ్గురు ప్రయాణించరాదన్నారు. మైనర్‌లకు వాహనాలివ్వటం నేరమని చెప్పారు. కార్యక్రమంలో చక్రవర్తి, శ్రీకాంత్, శామ్యూల్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువత స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలి

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు



ఉత్పత్తి వివరాలను తెలుసుకుంటున్న ఆనందబాబు

చుండూరు, జూలై 31 : గ్రామీణ యువత స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని మాజీ మంత్రి, వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు తెలిపారు. ఆలపాడులో శ్రీ గణేష్ ఎంటర్ ప్రైజెస్ ఇండస్ట్రీని బుధవారం ఆయన సందర్శించారు. గ్రామస్థాయిలో కొద్దిపాటి పెట్టుబడితో స్థాపించి పట్టుదలతో అంచలంచలుగా ఎదిగి సంస్థను విస్తరించడంతో పాటు ప్రస్తుతం భారత్‌పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌కు బ్రాండింగ్ వర్కును అందిస్తున్న సంస్థ నిర్వాహకుడు చేపల శివయ్యను ఆనందబాబు అభినందించారు. భారత్‌పెట్రోలియం కార్పోరేషన్‌కు ఈ సంస్థ అందిస్తున్న నూతన ఉత్పత్తులను ఆనందబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది, మండల తెలుగుదేశం, జనసేన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

రేపల్లె, జూలై 31 : తీరప్రాంతంలోని రైతుల అభ్యున్నతి కోసం మంత్రి అనగాని సత్యప్రసాద్ కృషి చేస్తున్నారని అనగాని శివప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలంలో ఖరీఫ్ సీజన్ సందర్భంగా వరి నాట్లు కోసం బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి వరినాట్లు వేశారు. ఈఏడాది ఖరీఫ్‌సీజన్‌లో రైతులకు వరిపట్ల అధిక దిగుబడులు సాధించాలని ఆకాంక్షించారు. సాగునీరు, ఎరువులను సమృద్ధిగా అందించేందుకు మంత్రి అనగాని కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపట్నం మండల టీడీపీ అధ్యక్షులు ఓగిబోయిన వెంకట్‌యాదవ్, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, కేసన రామకృష్ణ, తాతా ఏడుకొండలు, బొమ్మిడి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పల్లపట్ల గ్రామంలో నాట్లు ప్రారంభిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

తీరంలో శాంతిభద్రతలను కాపాడుతాం : ఎస్పీ



నిజాంపట్నం పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్పీ

రేపల్లె, జూలై 31 : తీర ప్రాంతంలో శాంతియుత వాతావరణంలో శాంతిభద్రతలను కాపాడే విధంగా చూస్తామని ఎస్పీ తుషార్ డూడి అన్నారు. నిజాంపట్నం పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం పోలీస్ సిబ్బందికి లా అండ్ ఆర్డర్‌పై సూచనలు చేశారు. అనంతరం నిజాంపట్నం హర్బర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యక్రమాలు చేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ప్రజలకు రక్షణ కల్పించే విధంగా పోలీస్ శాఖ స్నేహపూర్వకంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

జూద కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు : సీఐ

కొల్లూరు, జూలై 31 : జూద కార్యకలాపాలను ఉపేక్షించబోమని, వాటిని నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రామకృష్ణ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ తుషార్‌డుడీ ఆదేశాల మేరకు బుధవారం కొల్లూరు పోలీస్ స్టేషన్‌లో సీఐ విలేకర్ల సమావేశం నిర్వహించారు. సర్కిల్ పరిధిలో పేకాట, కోడి పందాలు, గంజాయి విక్రయాలు తదితర జూద కార్యకలాపాలు నిర్వహించే వాటిని విడనాడితే మంచిదని లేని పక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాలని హెచ్చరించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తే కేసులు నమోదు చేస్తామని, అలాగే మహిళలు, బాలికలను లైంగిక వేధింపులకు గురి చేసే వారిపై కూడా పీడీ యాక్టు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని సూచించారు. పేకాట, కోడిపందాలు, గంజాయి విక్రయాలు, సరఫరా, మహిళలపై లైంగిక వేధింపులకు గురి చేసే వారి వివరాలు అందిస్తే ఆయా వ్యక్తుల సమాచారం గోప్యంగా ఉంచుతామన్నారు. భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు ఎస్ఐలు శ్రీనివాసరావు, రవీంద్రారెడ్డిలకుగాని తనకు గాని సమాచారం తెలియజేయాలన్నారు.

గ్రామాల్లో ఆగస్టు 15 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

చుండూరు, జూలై 31 : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టనున్న ఇంటింటికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్నాయని, దీని కోసం ప్రజల్లో ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు వేటపాలెం పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ పోలే కోటేశ్వరరావు తెలిపారు. పెదగాదెలవర్రులో బుధవారం జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ మరణాల సంఖ్య నానాటికి పెరుగుతున్నాయి. తొలిదశలో దీనిని గురిస్తే ప్రాణాపాయం ఉండదన్నారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

టెంట్‌ను ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

కొల్లూరు, జూలై 31 : ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ టెంట్‌ను ఢీకొనడంతో గ్రామస్థులు ట్రాక్టర్‌ను అడ్డుకొన్న సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పెసరలంక గ్రామానికి చెందిన వారు తమ ట్రాక్టర్‌ల ద్వారా రాత్రివేళ ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. రావికంపాడు గ్రామం నుంచి ట్రాక్టర్ వెళ తుండగా ఓ ట్రాక్టర్ టెంట్‌ను ఢీకొనడంతో గ్రామస్థులు ఆగ్రహించి ట్రాక్టర్‌లను నిలిపివేసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రవీంద్రరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి ట్రాక్టర్లును పోలీసు స్టేషన్‌కు తరలించారు.

తల్లి మందలించిందని యువకుడి ఆత్మహత్య

కొల్లూరు, జూలై 31 : తల్లి మందలించిందని మనస్తాపం చెందిన ఓ యువకుడు పురుగు మందు తాగిన సంఘటన మంగళవారం జరిగింది. ఏఎస్ఐ అర్జున్ తెలిపిన వివరాల ప్రకారం... అనంతవరం గ్రామానికి చెందిన తిరుపతి సునీత పెద్ద కుమారుడు పృథ్వీ (23) నాలుగు రోజుల నుంచి పనులకు వెళ్ళకుండా ఉండటంతో అతని తల్లి నీ కంటే చిన్నవాడు రోజు పనికి వెళుతున్నాడని, నువ్వు మాత్రం ఎందుకు పని మానేసి తిరుగుతున్నావని మందలించింది. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్ళి పురుగు మందు తాగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకున్నాడు. గమనించిన తల్లి విషయం అడుగగా పురుగు మందు తాగానని చెప్పడంతో హుటాహుటిన యువకుడిని తెనాలి వైద్యశాలకు తీసుకురాగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు చెప్పారు.

అప్పుల బాధతో యువకుడు...



ఎ.గోపి (ఫైల్)

బాపట్ల రూరల్, జూలై 31 : అప్పుల బాధతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకుపాల్పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం గ్రామానికి చెందిన ఎ.గోపి(29) అదేగ్రామానికి చెందిన ఎ.వెంకటసుబ్బమ్మ ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అయితే ఆ యువకుడు ఉద్యోగం కోసం అప్పులు చేయటంతోపాటు ఒక సంవత్సరం క్రితం ప్రమాదంలో కాలు విరగటంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. తీసుకున్న అప్పులు కట్టలేక మనస్థాపంతో ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాపట్లరూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


పోటీలో తలపడుతున్న ఎద్దు

హోరాహోరీగా ఎడ్ల పందేలు

చినగంజాం, జూలై 31 :ఎడ్ల పందేలు హోరాహోరీగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామంలో అవనిగడ్డ కుటుంబీకుల ఇలవేల్పు శ్రీపల్నాటి ఈర్లంకమ్మ అమ్మవారి 16వ రోజు పండుగ సందర్భంగా రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఒంగోలు జాతి నాటు బండి పోలు రాధ బల ప్రదర్శన పోటీలలో సత్తా చాటేందుకు తలపడ్డాయి. రాష్ట్ర స్థాయి నాటు బండి పోలురాధ పోటీలను బుధవారం గ్రామ సర్పంచ్ నక్కల కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం వలన ప్రజల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. ఈ పోటీలకు వేటపాలెం, పాతచీరాల, పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని అవులదొడ్డి కొత్తగొల్లపాలెం, బాపట్ల పోతురాజు కొత్తపాలెం, సోపిరాల, నెల్లూరు జిల్లా తూర్పుగోనాల, జొన్నవాడ, తూర్పుగోసలపల్లె, కడవకుదురు, రాజుబంగారుపాలెం తదితర ప్రాంతాల నుంచి 12 జతల ఎడ్లు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రేక్షకుల ఈలలు, కేరింతలతో పల్లెపాలెం గ్రామంలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ పోటీలలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు గురువారం బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతగా తంగడ హసన్ వ్యవహరించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు కే.విష్ణు, నిర్వహణ కమిటీ సభ్యులు వల్లభుని శేషయ్య, అవనిగడ్డ వెంకటేశ్వర్లు, గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు.


సమావేశానికి హాజరైన రెండు పార్టీల కౌన్సిలర్‌లు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ

కౌన్సిల్‌లో అంతా గప్‌చుప్

● నోరు విప్పని రెండు పార్టీల కౌన్సిలర్లు

● మంత్రి గొట్టిపాటి ఆదేశాలతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

● కమిషనర్ సత్యనారాయణ

అద్దంకి, జూలై 31 : అద్దంకి మున్సిపల్ సమావేశం తీరు అందరినీ వి స్మయానికి గురి చేసింది. అద్దంకి పట్టణంలోని సమస్యలపై అటు వైసీపీ, ఇటు టీడీపీ కౌన్సిలర్‌లు ప్రస్తావించకపోవడం పట్ల పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మూడు సంవత్సరాలు మున్సిపల్ సమావేశం జరుగుతుందంటే రెండు పార్టీల కౌన్సిలర్ మధ్య మాటల యుద్ధమే సాగేది. అయితే టీడీపీ కూటమి అధికారం చేపట్టినప్పటి నుంచి కౌన్సిల్ సమావేశం తీరు పూర్తిగా మారిపోయింది. గతంలో సమస్యలపై ప్రశ్నించే టీడీపీ కౌన్సిలర్‌లు మిన్నకుండుండగా, వైసీపీ కౌన్సిలర్లు కూడా అంతకంటే మరింత మౌన వ్రతం పాటిస్తున్నారు. దీంతో అజెండాలోని అంశాలు చదవడానికి మాత్రమే పరిమితమవుతున్నారు. పట్టణంలో పలు సమస్యలు ఉన్నా సమావేశంలో ప్రస్తావించకుండా ఉండడం పట్ల ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వస్తున్నాయి. టీడీపీతో టచ్‌లో ఉన్న వైస్ చైర్మన్ 1 దేసు పద్మేష్ మున్సిపల్ సమావేశానికి హాజరుకాకపోవటం చర్చనీయాంశంగా మారింది. హాజరైతే ఏ పక్షం వైపు కూర్చుంటే ఏ సమస్య వస్తుందోనన్న ఆలోచనతో సమావేశానికి డుమ్మా కొట్టిఉంటారనే అభి ప్రాయం వ్యక్తం అవుతుంది. 13వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

అద్దంకి పట్టణంలో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో అద్దంకి పట్టణంలో సైడ్ డ్రైన్‌లు, విద్యుత్‌లైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. అజెండాలోని అన్ని అంశాలను ఆమోదిస్తున్నట్లు చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ ప్రకటించారు. అజెండాలో వివాదా స్పద అంశాలు ఉన్నప్పటికీ చర్చ జరగకపోవడం విమర్శలకు తావిస్తుంది. సమావేశం బయట చెవులు కొరుక్కున్న ఇరు పార్టీల కౌన్సిలర్‌లు సమావేశంలో మాత్రం నోరు విప్పకపోవడం అనుమానాలకు తావిస్తుంది.


మహిళ మెడలో గొలుసు లాక్కెకుతున్న దుండగుడు (ఫైల్)

చైన్ స్నాచర్ అరెస్ట్

చీరాలటౌన్, జూలై 31 : ఇటీవల చీరాల మండల పరిధిలోని రామకృష్ణాపురం గుంట మార్కెట్ సమీపంలో మహిళ మెడలో పట్టపగలే బంగారు గొలుసును తెంపుకుని వెళ్లిన నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం రాత్రి అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే చినగంజాం మండలపరిధిలోని కొత్తపాలెం గ్రామానికి చెందిన కుప్పాల బాలమురళీకృష్ణా రెడ్డి చీరాల రైల్వే స్టేషన్‌లో గూడ్స్ షెడ్డులో ఎరువులు బస్తాలు మోసేందుకు రోజువారి కూలీగా వెళ్తున్నాడు. ఈక్రమంలో జూలై 19వ తేదీన మద్యం సేవించి చీరాలకు వస్తున్నాడు. గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన చీదెళ్ల హేమసాయి లత స్వగ్రామం చీరాల రామకృష్ణాపురం. కాగా తిరునాళ్ల సందర్భంగా తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఈక్రమంలో ఉదయం సుమారు 10 గంటల సమయంలో బయటకు వెళ్లి వస్తుండగా ఎదరుగా ద్విచక్ర వాహనంపై వస్తున్న బాల మురళీకృష్ణారెడ్డి ఆమె మెడలో బంగారు చైన్, నల్లపూసల బంగారు గొలుసులు అపహరించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె కూడా ఎదురు తిరిగేందుకు యత్నించగా ఫలితం లేకపోయింది. దీంతో పెనుగులాటలో చైన్ తెగింది. సుమారు 10 గ్రాముల వరకు బంగారం అపహరించి పరారయ్యాడు. బాధితురాలు వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించగా పోలీసులు సీసీ కెమెరా ఆధారాలు సేకరించి మంగళవారం రాత్రి అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచారు.

మందను ఢీకొన్న బైకు

● నాలుగు గొర్రెలు మృతి మరికొన్నింటికి గాయాలు

మార్టూరు, జూలై 31 : జాతీయ రహదారిపై కోలలపూడి రోడ్డు నుంచి కోనంకి సెంటర్ మధ్యలో రోడ్డు దాటుతున్న గొర్రెల మందను ద్విచక్రవాహనదారుడు ఢీకొనడంతో నాలుగు గొర్రెలు చనిపోగా, మరి కొన్ని గాయపడ్డాయి. ఈసంఘటన బుధవారం రాత్రి 10 గంటల సమయంలో జరిగింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట కు చెందిన ఇద్దరు యువకులు బుల్లెట్‌పై వ్యక్తిగత పనులు నిమిత్తం అద్దంకికి వెళుతున్నారు. కోలలపూడి రోడ్డు వద్ద జె.పంగులూరు మండలం రామకూరు గ్రామానికి చెందిన ఎస్‌కే బాబావలి తన గొర్రెలను యద్దనపూడి పొలాలకు తీసుకొచ్చి వాటిని మేపుకొని తిరిగి రామకూరు గ్రామానికి వెళ్తూ కోలలపూడి వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో బుల్లెట్‌పై వేగంగా వస్తున్న యువకులు సయ్యద్ అబ్దుల్లా, ఎస్‌కే అబ్దుల్ రహమాన్‌ల గొర్రెల మందను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో నాలుగు గొర్రెలు చనిపోయాయి. మరి కొన్ని గొర్రెలకు గాయాలయ్యాయి. రూ.లక్ష దాకా నష్టం జరిగినట్లు బాధితుడు బాబావలి విలపిస్తున్నారు. సంఘటనా స్థలానికి సీఐ రాజశేఖర్‌రెడ్డి వెళ్లి పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకుల అక్రమ అంతస్థులు

అనుమతులు లేకుండానే నిర్మాణాలు

పన్ను వేసేందుకు కూడా

సాహసించని అధికారులు

రూ.50 కోట్ల మేర మున్సిపాలిటీ

ఆదాయానికి గండి

కూటమి ప్రభుత్వం రావడంతో

యంత్రాంగంలో కదలిక

దాదాపు 50 భవనాలకు నోటీసులు

మార్కాపురం పట్టణంలో గత ఐదేళ్ల కాలంలో వైసీపీ నాయకులు, అనుచరులు సాగించిన దురాగతాలు అన్నీఇన్నీ కావు. అక్కడా ఇక్కడా అని కాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా పట్టణమంతా బహుళ అంతస్థుల భవనాలు ఇష్టారీతిన నిర్మించారు. ఈ క్రమంలో నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. నియోజకవర్గ స్థాయి నాయకులు, మున్సిపాలిటీలోని ముఖ్యనాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో యథేచ్ఛగా నిర్మాణాలు సాగాయి. ఇంత జరుగుతున్నా రాజకీయ వత్తిళ్ల నేపథ్యంలో ఇచ్చింది పుచ్చుకొని అధికారులు కూడా చోద్యం చూశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రస్తుతం అధికారుల్లో చలనం మొదలైంది. గతంలో చూసీచూడనట్లు వ్యవహరించిన వాళ్లు నేడు నోటీసులు ఇస్తున్నారు. ప్రస్తుతం మార్కాపురం పట్టణంలో సుమారు 50కిపైగా అక్రమ నిర్మాణాలకు మున్సిపాలిటీ అధికారులు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేసిన వాటిని ప్రస్తుతం తొలగించే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టారు.


ఈ చిత్రంలోని షోరూమ్ స్థానిక కళాశాల రోడ్డులోనిది. ఇది ఏఎంసీ మాజీ చైర్మన్ అయిన వైసీపీ ముఖ్య నాయకునిది. ఆయన కుమారుని పేరున షోరూమ్ ఉంది. సంవత్సరం క్రితం ఈ షోరూం ప్రారంభమైంది. ఇంతటి షోరూంకు ఏడాదికి ఎంతలేదన్నా సుమారు రూ.2లక్షల వరకు మున్సిపాలిటీ పన్ను ఉంటుంది. కానీ అధికారం అండతో పన్ను కట్టడం లేదు. షోరూమ్ నిర్మించకముందు ఉన్న రెండు చిన్నపాటి భవనాలకు విధిస్తున్న రూ.21వేల పన్ను మాత్రమే నేటికి మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం వసూలు చేస్తోంది. ఈ షోరూమ్ ద్వారా సదరు నాయకుడు నెలకు రూ.2.5లక్షలు అద్దె వసూలు చేస్తున్నాడు. వాస్తవానికి షోరూం కమర్షియల్ నిర్మాణం. కానీ ఆ నాయకుడు రెసిడెన్షియల్ ప్లాన్ మాత్రమే తీసుకున్నాడు. జీప్లస్ టూకు మాత్రమే అనుమతులు తీసుకున్నా అదనంగా మరో రెండు అంతస్థులు నిర్మించాడు. అంతేకాక 256 సర్వేనంబరులో ఈ షోరూమ్ నిర్మించినా దానికి సంబంధించిన డాక్యుమెంట్లు మాత్రం 258 సర్వేనంబర్‌లోనివి. నిబంధనలను కాలరాసి ప్రధాన రహదారిపై బరితెగించి వైసీపీ నాయకుడు నిర్మిస్తున్నా, మున్సిపల్ అధికారులు మాతం మిన్నకుండిపోయారు.


ఈ చిత్రంలోని ఈ భవనం ఓ ఉపాధ్యాయునిది. గతంలో రెండు సాధారణ ఇళ్లు ఉండేవి. వీటిని నాలుగేళ్ల క్రితం కూలగొట్టి ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగు అంతస్థుల భవనం నిర్మించారు. వైసీపీ నాయకుల అండతో దానిని నిర్మించాడు. అద్దెల రూపంలో రూ.లక్షలు వసూలు చేస్తున్నా మున్సిపాలిటీకి పన్ను మాత్రం రూ.6,860 మాత్రమే చెల్లిస్తున్నాడు. ఈ భవనానికి కొలతల ప్రకారం పన్ను వేస్తే ఏడాదికి రూ.1.50 లక్షల మేర ఉంటుంది. ఈ నాలుగేళ్ల కాలంలో సుమారు రూ.6లక్షల మేర మున్సిపాలిటీ ఆదాయాన్ని కోల్పోయింది. ప్రభుత్వ ఆదాయానికి ఈ మేర గండిపడుతున్నా మున్సిపాలిటీ రెవెన్యూ విభాగం మాత్రం చోద్యం చూస్తోంది.

మార్కాపురం, జూలై 31: మున్సిపాలిటీల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా ముందుగా మున్సిపాలిటీలోని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను కలవాలి. నిర్మాణదారుడు అన్ని రకాలైన స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు కలిగి ఉండాలి. నిర్మాణానికి ముందే ఖాళీస్థలం పన్ను కూడా రెవెన్యూ విభాగానికి కట్టేయాలి. అంతేకాక మున్సిపాలిటీ అనుమతిపొందిన ప్లానర్ వద్ద ఎంత విస్తీర్ణంలో, ఎన్ని అంతస్థుల్లో నిర్మాణం చేస్తారో ప్లాన్ అప్రూవల్ తీసుకోవాలి. అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిర్మాణాలకు అనుమతులు ఇస్తారు. నిర్మాణం అనంతరం పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాత మున్సిపల్ రెవెన్యూ అధికారులు పన్ను వేస్తారు. కానీ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఇలాంటి నిబంధనలు అన్నింటికీ నాయకులు తిలోదకాలు ఇచ్చారు. మున్సిపాలిటీని సంప్రదించకుండానే ఇష్టారీతిన నిర్మాణాలు పూర్తిచేశారు. బ్యాంకుల్లో రుణం పొందాలనుకునే వాళ్లు మాత్రం ఏదో మొక్కుబడిగా ప్లాన్ వరకు తీసుకున్నారు. జీప్లస్‌టూకు అనుమతులు తీసుకొని అదనంగా మరో రెండు మూడు అంతస్థులు యథేచ్ఛగా నిర్మించారు. ఈ ఐదేళ్లలో నిర్మాణాలు పూర్తిచేసిన భవనాలు, వాణిజ్య సముదాయాల్లో 80శాతం ఇలా నిబంధనలు పాటించలేదని తెలుస్తోంది. ఈ విధంగా మార్కాపురం మున్సిపాలిటీ ఎంతలేదన్నా సుమారు రూ.50 కోట్ల వరకు ఆదాయం కోల్పోయినట్లు అంచనా.

కూటమి ప్రభుత్వం రాగానే అధికారుల్లో కదలిక

మార్కాపురం పట్టణంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమ నిర్మాణాల విషయంలో తొంగి చూసేందుకు కూడా మున్సిపాలిటీ అధికారులు భయపడ్డారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారిలో కదలిక మొదలైంది. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు ఇచ్చారు. అలాంటివి దాదాపు వంద వరకు ఉన్నట్లు సమాచారం. అలాగే పక్కాగా మున్సిపాలిటీ స్థలంలో నిర్మించిన బహుళ అంతస్థుల భవనాన్ని ఇటీవల కూల్చేశారు. అన్నా క్యాంటిన్ పక్కన వైసీపీ ముఖ్యనాయకుడి అనుచరుడు దానిని కట్టాడు. వైసీపీ పాలనలో టీడీపీకి చెందిన వాళ్లు నిర్మాణాలు చేసుకోవాలంటే పలు రకాల కొర్రీలతో అధికారుల ద్వారా ఇబ్బందులకు గురిచేశారు. ఇలాంటి ఫిర్యాదులు పదులసంఖ్యలో అప్పట్లో టీడీపీ నేత, ప్రస్తుత ఎమ్మెల్యే నారాయణరెడ్డి వద్దకు వెళ్లాయి. కాగా ముందుగా ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించిన వాటిని కూల్చేస్తున్నారు. ఎలాంటి కనీస అనుమతులు లేనివాళ్లకు, ప్లాన్ తీసుకున్నా నిర్మాణాల్లో తేడాలు ఉన్నవి, పన్నులు వేయని వాటికి ఇప్పటికే మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నిర్మాణదారులు నోటీసులకు సమాధానం ఇచ్చిన తర్వాత వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు సిద్ధమయ్యారు.

అక్రమ నిర్మాణాలు, పన్నులు చెల్లించని వారికి నోటీసులు ఇచ్చాం

మార్కాపురం పట్టణంలో అక్రమంగా నిర్మాణాలు చేసేవారికి, నిర్మాణాలు పూర్తిచేసి పన్నులు చెల్లించని వారికి నోటీసులు ఇచ్చాం. 10 రోజులవుతున్నా నోటీసులకు ఇప్పటికీ సమాధానాలు రాలేదు. ప్రధానంగా సెల్లార్లకు ఎవరూ అనుమతులు తీసుకోకుండానే ఇష్టారీతిన భవనాలు నిర్మించారు. అక్రమ నిర్మాణాలు చేసేవారిని ఎవరినీ ఉపేక్షించేది లేదు.

- ఇ.కిరణ్, మున్సిపల్ కమిషనర్, మార్కాపురం

ప్రజలకు జవాబుదారీగా పనిచేద్దాం

ఎమ్మెల్యే కొండయ్య

ఎక్స్‌అఫిషియో మెంబరుగా

ప్రమాణ స్వీకారం

చీరాల, జూలై 31 : ఎన్నికలు, రాజకీయాలు వేరని, గెలుపు, ఓటములు సహజమని, ప్రజాతీర్పుకు అందరూ కట్టుబడి ప్రజలకు జవాబుదారీగా కలిసి సేవలందిద్దామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్లో బుధవారం చైర్మన్ జంజనం శ్రీనివాస రావు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య ఎక్స్ అఫిషియో మెంబరుగా ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్ జంజనం సభా కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ముందస్తుగా తను, తమతో పాటు ఉన్న కౌన్సిలర్లు మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను కలిశామన్నారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా సమిష్టిగా పట్టాభివృద్ధికి పరస్పర సహకారంతో ముందుకు సాగాలని వారు దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. గతంలో కరణం బలరామకృష్ణమూర్తి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో టీడీపీ బాధ్యతలు నిర్వహించే సమయంలో తనకు, ప్రస్తుత ఎమ్మెల్యే కొండయ్య మధ్య ఉన్న అవినాభావ సంబంధాలను వివరించారు. తాము పూర్తిస్థాయిలో ఎమ్మెల్యే కొండయ్యకు సహకరిస్తామని, అదే విధంగా ప్రభుత్వ పరంగా పట్టణ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ సమిష్టిగా చీరాలను స్మార్ట్ టౌన్‌గా రూపొందిద్దామని అన్నారు.


మున్సిపల్ ఎక్స్ అఫిషియో మెంబరుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

సంప్రదాయబద్ధంగా ప్రమాణ స్వీకారం

కౌన్సిల్ అత్యవసర సమావేశానికి ఎమ్మెల్యే కొండయ్య హాజరయ్యే సమయంలో మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, చైర్మన్ జంజనం తదితరులు పుష్పగుచ్ఛం ఇచ్చి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే కొండయ్యతో ఎక్స్ అఫిషియో మెంబరుగా ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం బాధ్యతలు స్వీకరిస్తూ కొండయ్య రిజిస్టర్‌లో సంతకం చేశారు. అజెండాలోని అంశాల చర్చ అనంతరం ఎమ్మెల్యే కొండయ్యకు హుందాగా పౌరసన్మానం నిర్వహించారు. అజెండాలో మొత్తం 68 అంశాలు కాగా అందులో 8వ అంశాన్ని రద్దు చేశారు. ఆ అంశంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు సంబంధించి ఏఏ పత్రాలు అందజేశారో తెలిపాలని, అప్పటి వరకు ఆ అంశాన్ని రద్దు చేయాలని పలువురు కౌన్సిలర్లు సూచించడంతో రద్దు చేశారు. కొన్ని అంశాలలో కాంట్రాక్టర్లు నిర్ణీత ధర కన్నా ఎక్కువకు కోట్ చేయడం, బాగా తక్కువకు కోట్ చేయటంపై ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడారు. అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలలో 9, 67వ అంశాలను కొద్ది సవరణలతో ఆమోదించారు. మిగిలిన 65 అంశాలను కొద్దిపాటి చర్చతో ఆమోదించారు.

భారీగా పోలీస్ బందోబస్తు

కౌన్సిల్ అత్యవసర సమావేశం నేపథ్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు భారీగా పోలీసులు మోహరించారు. బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఇంత బందోబస్తు అవసరమా అని పలువురు వ్యాఖ్యానించారు.

అంటకాగిన వారు ఔట్!

వైసీపీ ప్రభుత్వ బాధితులకు ప్రాధాన్యం

పోలీసు బదిలీల్లో కూటమి ప్రభుత్వం మార్క్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో అంటకాగి విధి నిర్వహణలో అడ్డగోలుగా వ్యవహరించిన పోలీసు అధికారులపై కూటమి సర్కారు వేటు వేస్తోంది. అదేసమయంలో ఎన్ని అర్హతలు ఉన్నా పోస్టింగ్‌లు ఇవ్వకుండా వేధించిన, లూప్‌లైన్‌లో ఉంచిన వారికి ప్రాధాన్యం ఇస్తోంది. పోలీసు శాఖలో ఉన్నతాధికారుల నుంచి సీఐల వరకూ జరిగిన బదిలీలను పరిశీలిస్తే ఈ విషయం అర్థమవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా బుధవారం జరిగిన డీఎస్పీలు, సీఐల బదిలీల్లో గత ప్రభుత్వంతో అంటకాగిన వారిని పక్కనపెట్టి అర్హత ఉండీ ఇప్పటివరకూ అప్రధాన్య పోస్టుల్లో ఉన్న వారిని నియమించింది. సీఐల విషయంలోనూ అదేపంథాను అనుసరిస్తున్నట్లు ప్రాథమికంగా జరిగిన కొన్ని బదిలీల్లోనే తేటతెల్లమవుతోంది. దర్శి డీఎస్పీ అశోక్‌వర్ధన్‌రెడ్డిని బదిలీ చేసి పోలీసు హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అలాగే ఒంగోలు డీఎస్పీ కిషోర్‌ను బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. వీరిలో అశోక్‌వర్ధన్‌రెడ్డి అందరితో సమన్వయంగా ఉంటారన్న పేరున్నప్పటికీ ఎన్నికల పోలింగ్ రోజు దర్శి నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థికి మద్దతుగా వ్యవహరించారన్న ఆరోపణను ఎదుర్కొన్నారు. ఒంగోలులోని రిమ్స్ ఆవరణలో జరిగిన రాజకీయ ఘర్షణలో, వెంగముక్కలపాలెంలో పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన ఘర్షణలోనూ పోలీసుశాఖ అప్పటి అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరించిందన్న అపవాదును మూటగట్టుకుంది. తాలూకా సీఐపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు తీసుకున్నప్పటికీ, ప్రస్తుతం డీఎస్పీని బదిలీ చేసి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడం గమనార్హం. దర్శి డీఎస్పీగా కర్నూలు జిల్లాలో సీఐడీలో ఉన్న లక్ష్మీనారాయణకు అవకాశం ఇవ్వడంలో కూడా ఆంతర్యం లేకపోలేదు. వైసీపీ ప్రభుత్వం ఉన్నంత కాలం పక్కనపెట్టిన రాయపాటి శ్రీనివాసరావుకు ఒంగోలు డీఎస్పీగా అవకాశం ఇవ్వాలని భావించగా, గుంటూరు జిల్లాలో ఆయన అవసరం ఉందన్న కారణంతో తాత్కాలికంగా పోస్టింగ్ ఇవ్వలేదని తెలిసింది. మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావును కూడా హెడ్‌క్వార్టర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కువకాలం పనిచేసి గత వైసీపీ ప్రభుత్వంలో అప్రధాన్య పోస్టులో ఉన్న ఘట్టమనేని శ్రీనివాసరావును మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే అభ్యంతరం చెప్పినా నెల్లూరు రూరల్‌కు డీఎస్పీగా నియమించారు. బుధవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత వచ్చిన కొన్ని సీఐల పోస్టింగ్‌ల విషయంలోనూ అదే పంథా కనిపించింది. ఒంగోలు తాలూకాకు నియమించిన సీఐ అజయ్‌కుమార్, వన్‌టౌన్‌కు నియమితులైన వై.నాగరాజు, సింగరాయకొండ సీఐగా నియమితులైన హజరత్తయ్య, మార్టూరు సీఐగా నియమితులైన ఎన్.శేషగిరిరావు, చీరాల వన్‌టౌన్‌కు బదిలీ అయిన మారేడు శ్రీనివాసరావు, సంతమాగులూరు సీఐగా నియమితులైన కాకుమాను వెంకట్రావు కూడా ఇప్పటివరకూ వీఆర్‌లోనూ, ప్రాధాన్యం లేని పోస్టుల్లో ఉన్నవారే. గత ప్రభుత్వం వారిని కావాలని పక్కనపెట్టింది. కూటమి ప్రభుత్వం గుర్తించి వారికి కీలక సర్కిళ్లను అప్పగించింది. స్థానికంగా మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినా సదరు అధికారుల గత పనితీరును పరిశీలించిన తర్వాతే పోస్టింగ్‌లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. అందువలన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన సిఫార్సులు కూడా చెల్లడం లేదని సమాచారం. చీమకుర్తి సీఐగా గతంలో ప్రచారం జరిగినట్లు హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ సిఫారసు చేసిన సుబ్బారావుకే దక్కింది.

కేజీబీవీలో విద్యార్థిని ప్రసవం

● బాత్‌రూంలో శిశువు మరణం

● బాలికను రిమ్స్‌కు తరలించిన పోలీసులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం)జూలై 31 : చదువుకుంటున్న బాలిక గర్భం దాల్చి పాఠశాలలోనే ప్రసవమైన ఘటన ప్రకాశం కొత్తపట్నం మండలం పాదర్తి కేజీబీవీ పాఠశాలలో బుధవారం జరిగింది. ఈ వ్యవహారంపై అధికారులు సీరియస్‌గా స్పందించారు. బాలికను వెంటనే ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న 16ఏళ్ల బాలిక క్యాంపస్‌లోని బాత్‌రూమ్‌లోనే ప్రసవించింది. ఆ తర్వాత దాదాపు రెండు మూడు గంటలపాటు అందులోనే ఉండిపోయింది. దీంతో ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు బాత్‌రూమ్‌లోకి తొంగిచూడటంతో ప్రసవించిన విషయం బయటకు తెలిసింది. బాలికను బయటకు రప్పించి విచారించారు. చీమకుర్తి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక జూన్ 19వతేదీన పాదర్తి వద్ద ఉన్న కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరింది. చేరిన తర్వాత వారంరోజుల పాటు హోమ్‌సిక్ పేరుతో ఇంటికి పోయి తిరిగి పాఠశాలకు వచ్చింది. రోజూ తరగతులకు హాజరవుతూనే ఉంది. బుధవారం ఉదయం 11గంటల సమయంలో బాత్‌రూమ్‌లోకి పోయి ప్రసవించిందని కళాశాల ప్రిన్సిపాల్, ఇతర ఉపాధ్యాయులు చెబుతున్నారు. స్థానిక మహిళా పోలీసు ద్వారా విషయం తెలుసుకున్న కొత్తపట్నం ఎస్ఐ సాంబశివరావు కేజీబీవీకి వెళ్లి విచారణ జరిపారు. కొత్తపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి పాఠశాలకు వెళ్లి బాలికకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర, రిమ్స్ వైద్యశాల సిబ్బంది అక్కడకు చేరుకుని వి వరాలు సేకరించారు. కాగా బాలిక తొమ్మిది నెలల గర్భవతిగా కళాశాలలోనే రెండు నెలల పాటు చదువు కొనసాగిస్తుండగా ఆ విషయాన్ని పాఠశాల సిబ్బంది ఎందుకు గుర్తించలేకపోయారు అనే ప్రశ్న తలెత్తుతోంది. ప్రసవానికి ముందు పడే వేదన అంతా ఇంతా కాదు. ఆ సమయంలో కూడా బాలిక నొప్పులు పడుతున్న విషయం కూడా తమకు తెలియదని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. బాలిక బాత్‌రూమ్‌కు పోయి గంటల తరబడి రాకపోయేసరికి వెళ్లిచూడగా అసలు విషయం తెలిసిందని కళాశాల ప్రిన్సిపాల్ అంటున్నారు. అప్పటి వరకు తమకు ఆ బాలిక గర్భవతి అని తెలియదని అంటున్నారు. కాగా బాలికను వైద్యం కోసం రిమ్స్ వైద్యశాలకు తరలించిన అధికారులు పూర్తి వివరాలు తెలుసుకుంటున్నారు. బాలిక చీమకుర్తి మండలానికి చెందిన కారణంగా చీమకుర్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.


వివరాలు సేకరిస్తున్న అధికారులు


వృద్ధురాలి నివాసం వద్ద విచారిస్తున్న చీరాల ఇన్‌చార్జి డీఎస్పీ నాయక్, సీఐ శ్రీనివాసరావు

అమ్మమ్మపై మనవడి దాడి

● అక్కడికక్కడే మృతి ● కేసు నమోదు

పర్చూరు, జూలై 31 : క్షణికావేశంలో వృద్ధురాలిపై మనవుడు దాడిచేసి గాయపరచడంతో ఆమె అక్కడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన కారంచేడులో బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల తెలిపిన వివరాల మేరకు కారంచేడు పాత మాలపల్లిలో షేక్ రాజాంబీ భర్త చనిపోవడంతో ఒంటరిగా నివాసం ఉంటుంది. ఆమె కుమార్తె, అల్లుడు కూడా చనిపోవడంతో మనవుడు షేక్ బాజీ అమ్మమ్మతో కలసి కారంచేడులోనే ఉంటున్నారు. మంగళవారం రాత్రి అన్నం తినే విషయంలో గొడవ పడి అమ్మమ్మపై దాడిచేయడంతో ఆమె మృతి చెందారు. బుధవారం చుట్టుపక్కలవారు గుర్తించి బంధువులకు సమాచారమిచ్చారు. చీరాల ఇన్‌చార్జి డీఎస్పీ నాయక్, ఇంకొల్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, చినగంజాం ఎస్సై ఎం.శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు హత్య కేసుగా నమోదు చేశారు. బాజీ మానసిక పరిస్థితి సక్రంగా లేదని స్థానికులు అంటున్నారు.

దర్శి డీఎస్పీగా లక్ష్మీనారాయణ

● ముగ్గురు డీఎస్పీలు హెడ్‌క్వార్టర్‌కు అటాచ్‌మెంట్



ఒంగోలు(క్రైం), జూలై 31: రాష్ట్రంలో భారీగా డీఎస్పీ బదిలీలు జరిగాయి. జిల్లాలో దర్శి డీఎస్పీగా ప్రస్తుతం సీఐడీలో పనిచేస్తున్న డి.లక్ష్మీనారాయణను నియమిస్తూ బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దర్శిలో పనిచేస్తున్న పి.అశోక్‌వర్ధన్, మార్కాపురం డీఎస్పీ బాలసుందరరావు, ఒంగోలు డీఎస్పీ కిషోర్‌బాబులను హెడ్‌క్వార్టర్‌లో అటాచ్‌మెంట్ చేయాల్సిందిగా ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. కనిగిరి డీఎస్పీగా పనిచేస్తున్న రామరాజు రిటైర్‌మెంట్ గడువు కేవలం నెలరోజులు మాత్రమే ఉండటంతో ఆయన్ని ప్రస్తుతానికి బదిలీ చేయలేదు. ఒంగోలు, మార్కాపురం డీఎస్పీలను ఇంకా నియమించాల్సి ఉంది.

మొరాయిస్తున్న బస్సులు

- కాలంచెల్లిన ఆర్టీసీ వాహనాలు
- ప్రయాణికులకు అవస్థలు

అద్దంకి, జూలై 31 : కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వినుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ఇటీవల తరచూ మొరాయిస్తున్నాయి. పక్షం రోజుల వ్యవధిలోనే అద్దంకి పట్టణంలో రెండు సార్లు వినుకొండ డిపో బస్సులు మొరాయించాయి. అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో రోడ్డు మధ్యలో బస్సు నిలిచిపోగా, షాపుల నిర్వాహకులు దానిని పక్కకు నెట్టారు. బుధవారం మధ్యాహ్నం వినుకొండ డిపోకు చెందిన బస్ అద్దంకి ఆర్టీసీ బస్టాండ్‌లో మొరాయించడంతో ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు బస్సును నెట్టారు. దూరప్రాంతం రూట్లలో సైతం కాలం చెల్లిన బస్సులనే నడుపుతుండడంతో మార్గమధ్యంలో ఎక్కడా నిలిచిపోతాయోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. వినుకొండ నుంచి ఒంగోలుకు సుమారు 80 కి.మీ దూరం ఉండగా వినుకొండ డిపో నుంచి నడిపేవాటిలో అత్యధిక శాతం కాలం చెల్లిన బస్సులు ఉన్నాయని, ప్రయాణం కూడా నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి కాలం చెల్లిన వాహనాల నిలిపివేసి వాటి స్థానంలో కొత్త బస్సులను ఆయా రూట్లలో నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అద్దంకి బస్టాండ్‌లో వినుకొండ డిపోకు చెందిన బస్సును నెడుతున్న ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు

కాపు, బలిజ సంక్షేమ సేన పార్లమెంట్ అధ్యక్షుడిగా కోటయ్య



చినగంజాం, జూలై 31 : మండలంలోని సోపిరాల గ్రామానికి చెందిన శిఖరం కోటయ్య కాపు, బలిజ సంక్షేమ సేన బాపట్ల జిల్లా పార్లమెంట్ అధ్యక్షుడిగా నియమితుల య్యారు. కాపు, బలిజ సంక్షేమ సేన సంఘం జిల్లా అధ్యక్షుడు తరణి గోపాలకృష్ణ బుధవారం కోటయ్యకు నియామకపత్రం అందజేశారు. కాపు, బలిజ సంక్షేమ సేన ఎగ్జిక్యూటివ్ కమిటీ తీర్మానం ప్రకారం కోటయ్యను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడు తూ కాపు, బలిజ సంక్షేమ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. కోటయ్యను సోపిరాల గ్రామ పెద్దలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు అభినందనలు తెలిపారు.

ఇంటర్ పాఠ్యపుస్తకాలు సిద్ధం

ఇంకొల్లు, జూలై 31 : ఇంకొల్లు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రభుత్వం అందజేయనున్న పాఠ్యపుస్తకాలు సిద్ధంగా ఉన్నట్లు ఎంఈవో అజయ్‌బాబు తెలిపారు. అందరికీ పుస్త కాలు అందేలా చూడాలని సూచించారు.



తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిబ్బంది

చినగంజాం తహసీల్దార్‌గా ప్రభాకరరావు

చినగంజాం, జూలై 31 : చినగంజాం తహసీల్దార్‌గా జీవిగుంట ప్రభాకరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు బదిలీపై గుంటూరు పశ్చిమకు బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గుంటూరు జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ప్రభాకరరావు పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ప్రభాకరారావుకు కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ దాసరి శ్రీకాంత్, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కే.నాగకుమార్, గ్రామ రెవెన్యూ అధికారులు నాగిరెడ్డి నాగరాజు, షేక్ మున్నీర్, బండారు దానియల్, పి.నాగరాజురెడ్డి, ఆమంచి సత్యనారాయణ, శ్రీదేవి, షేక్. బాషా, మోహన్‌రావు, పీతా ఏడుకొండలు, చెంచుపున్నమ్మ, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

యద్దనపూడి తహసీల్దార్‌గా రవికుమార్

యద్దనపూడి, (మార్టూరు) జూలై 31 : యద్దనపూడి తహసీల్దార్‌గా కే రవికుమార్ బుధవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన తహసీల్దారు వై.నాగరాజు బదిలీ కాగా అతని స్థానంలో రవికుమార్ వచ్చారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్‌కు డీటీ మస్తానరావు, ఆర్ఐ విష్ణు, రెవెన్యూ ఉద్యోగులు పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అదేవిధంగా మార్టూరు మండల తహసీల్దారు సంధ్యశ్రీ కలెక్టర్ కార్యాలయానికి బదిలీ కాగా వారి స్థానంలో సంతమాగులూరు మండలం నుంచి టీ ప్రశాంతి మార్టూరుకు బదిలీ అయ్యారు. ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.



రవికుమార్‌ను అభినందిస్తున్న ఉద్యోగులు

చీరాల తహసీల్దార్‌గా గోపీకృష్ణ



చీరాలటౌన్, జూలై 31 : చీరాల తహసీల్దార్‌గా కె. గోపీకృష్ణ నియామకమయ్యారు. ఈమేరకు మంగళవారం ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో గోపీ కృష్ణ బాపట్ల కలెక్టరేట్‌లో ఏవోగా పని చేస్తున్నారు. అయితే ఎన్నికల విధుల్లో భాగంగా నెల్లూరు జిల్లా చేజెర్ల మండల తహసీల్దార్‌గా వెళ్లారు. అలాగే ఎన్నికల విధులకు పురమాయించిన అధికారులను తిరిగి పాత జిల్లాలకే పిలవడంతో చీరాలకు నియామకమయ్యారు. మరికొద్ది రోజులలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

బాధ్యతగా పనిచేయండి : ఎమ్మెల్యే కొండయ్య

వేటపాలెం(చీరాల), జూలై 31 : ప్రజలతో మర్యాదగా నడుచుకోండి. బాధ్యతగా పనిచేయండని ఎమ్మెల్యే కొండయ్య తహసీల్దార్ పార్వతికి చెప్పారు. వేటపాలెం మండల నూతన తహసీల్దార్‌గా నియమితులైన పార్వతి బుధవారం ఎమ్మెల్యే కొండయ్యను మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేశారు. కొండయ్య మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా ప్రజా ప్రయోజనాలే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.



ఎమ్మెల్యేకు మొక్కను అందజేస్తున్న తహసీల్దార్ పార్వతి

ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్‌ను ప్రదర్శించాలి

అద్దంకిటౌన్, జూలై 31 : అద్దంకి మండలంలోని అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులందరూ గురువారం 10 గంటలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు సంబంధించి నోటిపికేషన్ బోర్డులో ప్రదర్శించాలని ఎంఈవోలు డి. గంగాధరరావు, బి. సుధాకరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు ఓటరు జాబితాలను తయారుచేసి నోటీసు బోర్డులో ప్రదర్శించాలని సూచించారు.

పింఛన్ల పంపిణీకి 250 మంది సిబ్బంది

పంగులూరు, జూలై 31 : మండలంలోని 14 సచివాలయాల పరిధిలోని 21 గ్రామ పంచాయతీలలో గురువారం నూరు శాతం పింఛన్‌లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో మాధ్యూబాబు తెలిపారు. ఇందుకోసం 250 మంది సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. మొత్తం 7,984 మందికి 3 కోట్ల 24 లక్షల, 94 వేల 500 రూపాయలను వివిధ క్యాటగిరీలవారీ పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

తహసీల్దార్ మెహర్‌బాబుకు సత్కారం



మెహర్ బాబును సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కారంచేడు(పర్చూరు), జూలై 31 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కారంచేడు మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై తన సొంత జిల్లాకు వెళుతున్న మెహర్‌బాబును బుధవారం రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్వీ రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెహర్‌బాబు మాట్లాడుతూ సిబ్బంది సహకారంతోనే తాను ఎన్నికల విధులను సక్రమంగా నిర్వహించానని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సుశీలాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచ క్రవాహనం బోల్తా - ఒకరికి గాయాలు

బల్లికురవ, జూలై 31 : ద్విచ క్రవాహనం బోల్తా పడి ఒకరికి గాయాలు అయ్యాయి. అందిన వివరాల మేరకు మండలంలోని కొమ్మినేనివారిపాలెం వద్ద అద్దంకి బ్రాంచి కాలువ సమీపంలో బుధవారం వలపర్లకు చెందిన ఆవుల శ్రీను వైదన వెళ్లి వస్తుండగా మోటార్ సైకిల్ అదుపు తప్పి పడిపోయింది. తీవ్రగాయాలైన శ్రీనును వలపర్లలో ప్రవేట్ వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

అద్దంకి, జూలై 31 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు అంకరాజు(28) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలం పోలవరానికి చెందిన అంకరాజు అద్దంకిలో చెల్లెలు వద్ద వైద్య చికిత్స కోసం ఉన్న తండ్రి వద్దకు వచ్చి సోమవారం రాత్రి అద్దంకి నుంచి పోలవరం మోటార్ సైకిల్ పై వెళ్తూ తిమ్మాయపాలెం సమీపంలో ముందు వెళ్తున్న మోపెడ్‌ను ఢీకొట్టాడు. తీవ్రగాయాలైన అంకరాజు అద్దంకి ఆసుపత్రికి, అనంతరం ఒంగోలు వైద్యశాలకు, అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రా త్రి మృతి చెందడంతో అక్కడ నుంచి స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం వచ్చింది. అంకమ్మరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.



శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీనివాసరావు సేవలు అభినందనీయం

బల్లికురవ, జూలై 31 : ఉపాధ్యాయ వృత్తిలో 35 ఏళ్ల పనిచేసి ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన యద్దనపూడి శ్రీనివాసరావు సేవలు అభినందనీయం అని బల్లికురవ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతురావు అన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న సోషల్ టీచర్ యద్దనపూడి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ వీడ్కోలు సభ బుధవారం పాఠశాలలో జరిగింది. ఈసందర్భంగా శ్రీనివాసరావుకు తోటి ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఆయన సేవలు, మంచితనాన్ని గుర్తుచేశారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ ఇష్టంతో క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రంలోకి పాములు

భయాందోళన చెందుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



పాములు రాకుండా కాపలాగా కూర్చున్న ఆయా

బల్లికురవ, జూలై 31 : మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ఉన్న అంగన్ వాడీ కేంద్రంలోకి మంగళవారం నాలుగు పాములు వచ్చాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. బుధవారం అంగన్ వాడీ కేంద్రానికి వచ్చిన విద్యార్థులను లోపల కుర్చీబెట్టి పాములు రాకుండా తలపుల వద్ద ఆయా కాపాలాగా కూర్చున్నారు. కేంద్రం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉందని ఆ స్థలంలో పెద్ద పెద్ద తుమ్మ పొదలు, గడ్డి ఉండడంతో పాములు తిరుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. అంగన్‌వాడీ బడిలోకి నాలుగు పాము పిల్లలు రాగా, మూడింటిని ప్రజలు చంపి వేశారని ఒకటి తప్పించుకు పోయిందని, ఇలా అయితే కేంద్రానికి చి న్నారులను పంపాలంటే భయమేస్తుందని తెలిపారు. వెంటనే గ్రామ పంచాయతీ, పాఠశాల పేరెంట్స్ కమిటీ వారు పొదలను తొలగించి గడ్డి మందు వేయించాలని ప్రజలు కోరుతున్నారు.



దట్టంగా ఉన్న పిచ్చిచెట్లు

అంగన్‌వాడీకి స్టీల్ ప్లేట్లు, గ్లాసుల అందజేత



స్టీల్ ప్లేట్లను అందజేసిన సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 31 : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రానికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. ఈక్రమంలో ఆళహరి వెంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఆళహరి హరి ప్రసాద్ సౌజన్యంతో అద్దంకి పట్టణంలోని ఇందిరానగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రానికి విద్యార్థులు, తల్లులు, గర్భిణులకు భోజనం చేసుందుకు 30 స్టీల్ ప్లేట్లు, 30 స్టీల్ వాటర్ గ్లాసులు, నాలుగు కుర్చీలను అందజేయడం అభినందనీయమని రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. ఈ సందర్భంగా దాత ఆళహరి హరిప్రసాద్‌ను రోటరీ క్లబ్ సభ్యులు అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళిసుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, చిన్ని మురళీకృష్ణ, జ్యోతి చంద్రమౌళి, శ్రీనివాసరావు, ఊటుకూరి రామకోటేశ్వరరావు, పి.ఆంజనేయులు, నర్రా శ్రీలక్ష్మి, కార్తీక్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోటేరియన్, పురావస్తు పరిశోధకులు విద్వాన్ జ్యోతి చంద్రమౌళి 74వ పుట్టిన రోజును రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి వేడుకలు జరుపుకోవడంతో పాటు చంద్రమౌళి ఉపాధ్యాయుడుగా, పురావస్తు పరిశోధకుడుగా, రచయితగా అందించిన సేవలను సభ్యులు కొనియాడారు.

లక్ష్మికి మంత్రి గొట్టిపాటి నివాళి

ఇంకొల్లు, జూలై 31 : మండలంలోని నాగండ్ల గ్రామానికి చెందిన సినీ నిర్మాత చెరుకూరి సుధాకర్, ప్రముఖ పారిశ్రామికవేత్త అనిల్ మాతృమూర్తి లక్ష్మికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నివాళులర్పించారు.నాగండ్లలో బుధవారం సుధాకర్ ఇంట్లో జరిగిన లక్ష్మి మొదటి వర్ధంతి కార్యక్రమంలో ఆయన పా ల్గొన్నారు. లక్ష్మి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరగంధం ఆంజనేయులు, నాగండ్ల టీడీపీ నాయకులు ఉన్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి రవికుమార్

మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ

- హాస్టల్‌లో సౌకర్యాలపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆగ్రహం
- విశ్రాంతి గదుల్లోకి సైతం వ్యర్థ జలాలు
- పేరుకున్న చెత్త, విష సర్పాల భయాందోళనలో విద్యార్థులు
- తీరు మార్చుకోవాలంటూ హెచ్చరిక



హాస్టల్ చుట్టూ పిచ్చిచెట్లు



విశ్రాంతి గదిలోకి చేరిన వ్యర్థ జలాలు

చీరాలటౌన్, జూలై 31 : చీరాల మండల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్‌ను బుధవారం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బి.పద్మావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అపరిశుభ్రంగా ఉన్న వంట గది, ఇతర గదులు, పరిసరాలను నిశితంగా పరిశీలించారు. ప్రిన్సిపాల్ సరళ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యానేకథల సామర్థ్యానికి సరిపడా తాగునీరు లేకపోవడంపై అసహనం చెందారు. అలాగే కంప్లైంట్ బాక్స్ ఇసుకలో కూరుకుపోయి ఉన్నట్లు గుర్తించారు. హాస్టల్ ఆవరణలో చిల్ల చెట్లు పేరుకుపోవడం తీరును గమనించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో సమావేశమై సమస్యలను అడిగి తెసుకున్నారు. వారి సమస్యలను విని ఆమె నివ్వెరపోయారు. అనంతరం మాట్లాడుతూ స్కూల్ సౌకర్యాలపై అందిన ఫిర్యాదుల మేరకే ఆకస్మికంగా తనిఖీ జరిగినట్లు తెలిపారు. స్కూల్ పరిసరాల్లో విష సర్పాల కదలికలు ఉన్నట్లు విద్యార్థులు చెప్పినట్లు పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యంతో చెలగాట మాడరాదన్నారు. వేగవంతంగా వారి సమస్యల పరిష్కార దిశగా సిబ్బంది అడుగులు వేయాలని లేకుంటే ఉపేక్షించేదని సూచించినట్లు చెప్పారు. ఆమె వెంట ఎమ్ఈవో సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా బాలల సంక్షేమ కమిటీ విభాగం సభ్యురాలు నీలిమ, పరిరక్షణ విభాగం అధికారిణి స్వప్నప్రియ స్కూల్ సిబ్బంది ఉన్నారు.



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పద్మావతి



గోడౌన్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న డీఎస్‌వో విలియమ్స్

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా

డీఎస్‌వో విలియమ్స్

అద్దంకి, జూలై 31 : పేద ప్రజలకు చేరాల్సిన రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాత్రి సమయాలలో ప్రత్యేక నిఘా పెట్టినట్లు డీఎస్‌వో విలియమ్స్ తెలిపారు. అద్దంకి పట్టణంలోని మార్కెట్ యార్డులో ఉన్న సివిల్ సప్లయీస్ గోడౌన్‌ను బుధవారం విలియమ్స్ పరిశీలించారు. స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా విలియమ్స్ మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. బియ్యం సరఫరా లో తూకాలలో వ్యత్యాసం లేకుండా ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రేషన్ దుకాణాలను ప్రతి మూడు రోజులకు ఒక సారి వీఆర్‌వోలు తనిఖీ చేసి తహసీల్దార్లకు నివేదిక ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా కార్డుదారులకు అందించడమే లక్ష్యం పనిచేస్తున్నామన్నారు.

వేటపాలెం పీహెచ్‌సీకి వైద్యుల నియామకం

వేటపాలెం(చీరాల), జూలై 31 : వేటపాలెం పీహెచ్‌సీలో వైద్యుడు డాక్టర్ బాలరాజు, ఫార్మసిస్టు వెంకట ప్రసాద్, ఇతర సిబ్బంది మధ్య నెల కొన్న వరుస వివాదాల నేపథ్యంలో వారిని అక్కడి నుంచి బదిలీ చేస్తూ డీఎంహెచ్‌వో డాక్టరు విజయమ్మ ఉత్తర్వులు జారీ చేశారు. వారి స్థానంలో చీరాల పీపీ యూనిట్‌లో పనిచేస్తున్న డాక్టర్ స్వాతి కిరణ్, డాక్టర్ సాయి వైష్ణవి, స్టాఫ్ నర్స్ నాగమణిలను వేటపాలె పీహెచ్‌సీకి తాత్కాలికంగా బదిలీ చేశారు. ఇప్పటి వరకు వేటపాలెం పీహెచ్‌సీ ఇన్‌చార్జి డీడీవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈపురుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రీదేవిని ఆ బాధ్యతలను డాక్టర్ స్వాతికిరణ్‌కు అప్పగించాలని ఉత్తర్వులు ఇచ్చారు.

సభ్యత్వాల నమోదుకు 5వరకు గడువు

చీరాల, జూలై 31 : జనసేన పార్టీ సభ్యత్వాల నమోదుకు ఈ నెల 5వ తేదీ వరకు గడువును పొడిగించారని ఆ పార్టీ సెంట్రల్ ఆంధ్ర ప్రోగ్రామ్ కన్వీనర్, చీరాల నియోజకవర్గ సభ్యత నమోదు కార్యక్రమ పరిశీలకుడు ఆల అనిల్ బుధవారం తెలిపారు. ఈ క్రమంలో పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా పనిచేస్తూ సభ్యత్వాల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. 4వ విడత సభ్యత్వ నమోదులో చీరాల నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణపై సమిష్టిగా అడుగులు వేద్దామని అనిల్ పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న బాలసుబ్రహ్మణ్యం

రామాయణగాథ అంటే ఇష్టం

అద్దంకిటౌన్, జూలై 31: తెలుగు కవులకు రామాయణగాథ అంటే ఇష్టం అని శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం స్థానిక కమలేశ్వరస్వామి ఆలయంలో సృజన సాహిత్య సమావేశం ఇలపావులూరి శేషతల్పసాయి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మహాకవి ఎర్రన రచించిన రంగనాథ రామాయణ కావ్యం రచించారని, అలాంటి మహా భాస్కర రామాయణం, రంగనాథ రామాయణం, తిక్కన నిర్వచనోత్తర రామాయణం, కంకంటి పాపరాజు ఉత్తర రామాయణం, మొల్ల రామాయణం కల్పవృక్షం వంటి కావ్యాలు తెలుగువారు భక్తి ప్రపత్తులతో చదువుతారని వక్తలు గుర్తు చేశారు. రంగనాథ రామాయణం జన సామాన్యంలో ప్రచారంలో ఉన్న గ్రంథం అన్నారు. ఈ కార్యక్రమంలో లక్కరాజు శ్రీనివాసరావు, డాక్టర్ యు.దేవపాలన, డీవీఎం సత్యనారాయణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, గాడేపల్లి దివాకర్ దత్తు, పాలపర్తి జ్యోతిష్మతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల పదివి విరమణ చేసిన ఆర్వీ రాఘవరావును వీరవల్లి సుబ్బారావు(రుద్రయ్య) నేతృత్వంలో ఘనంగా సన్మానించారు.

ట్రాక్టర్ పైకి ఎక్కిన లారీ

మేదరమెట్ల, జూలై 31 : జాతీయ రహదారిలో మేదరమెట్ల బైపాస్‌లో పొగాకు చెక్కుల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను లారీ టాలర్ ఢీకొట్టింది. బుధవారం అ ద్దంకి మండలం వెంకటాపురానికి చెందని బీ శేషారెడ్డి మధ్యాహ్నం పొగాకు బోర్డు నుంచి ట్రాక్టర్‌పై చెక్కులను ట్రాక్టర్‌పై వేసుకుని వెళ్తుండగా హైవే నుంచి హైదరబాద్ వెళ్లడానికి సర్వీస్ రోడ్డులో వెళ్తూన్న లారీ టాలర్ డ్రైవర్ నిద్రమత్తు కారణంగా హైవేలో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. రెండు రోడ్డుల మధ్యలో ఉన్న కాలువలోకి ట్రాక్టర్ పూర్తిగా ఎక్కి పోయింది. ట్రాలర్ ట్రాక్టర్ పైకి ఎక్కంది. ఈ ప్రమదంలో శేషారెడ్డి కాలికి తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయా లయ్యాయి. 108 అంబులెన్స్‌లో శేషారెడ్డిని ఒంగోలు తరలించారు. సంఘటన స్థలాని పోలీసులు పరిశీలించారు.



ట్రాక్టర్ పైకి ఎక్కిన లారీ

సంఘటితంతోనే చేనేత రంగం అభివృద్ధి

చీరాలటౌన్, జూలై 31 : చేనేతలంతా సంఘటితంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని పలువురు చేనేత నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర చేనేత జన సమైక్య ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గడియార స్థంభం కూడలిలో బహిరంగ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ చేనేత పరిశ్రమను రక్షించుకోవాలని, వారు ఎదుర్కొనే సమస్యల నుంచి నివృత్తి పొందాలనే లక్ష్యంతో కార్యక్రమం తలపెట్టినట్లు వివరించారు. జూలై 31వ తేదీని జాతీయ చేనేత పరిరక్షణ దినంగా పాటించాలని వివరించారు. పవర్ లూమ్స్ విధానంతో తయారు చేస్తున్న చీరలను చేనేత చీరలుగా విక్రయిస్తున్న నేపథ్యంలో చేనేత రంగం దెబ్బతింటున్నట్లు పేర్కొన్నారు. ఈక్రమంలోనే మాస్టర్ వీవర్స్, సహకార సంఘాల ప్రతినిధులు కార్మికులకు ఉపాధి కల్పించలేక పోతున్నట్లు చెప్పారు. ఇలానే అనేక విధాలుగా వ్యవస్థ పరిస్థితి దయనీయంగా ఉందని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ కలసి కట్టుగా ముందుగా సాగి విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు మాచర్ల మోహన్‌రావు, సజ్జా హేమలత, బీరక సురేంద్ర, దామర్ల శ్రీకృష్ణ, చుండూరి వాసు, కాటూరి వెంకటేశ్వర్లు, కర్ల లక్ష్మారావు, వీర నాగేశ్వరరావు, శీలం రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు